
# నూతన రాజ్యాంగ విధి విధానాలు




ఆచార్య శేషయ్య కందమూరు, పిహెచ్.డి.,

# అంకితం

స్వధర్మ నిర్వహణ కొరకు అన్ని రకాల తారతమ్యాలను వ్యత్యాసాలను మనసు నుండి తరిమేసి, దుర్మార్గులను శిక్షించి సన్మార్గులను రక్షించేందుకు కంకణబద్ధులై, సమాజ మథనంలోని గరళాన్ని స్వీకరిస్తూ, గీతలో వచించిన చందాన చిరిగిన వస్త్రాలలా జీవితాలను తృణప్రాయంగా వదిలి, గతంలో ఆగతంలో, నైతికతకు ధార్మికతకు న్యాయానికి బద్ధులైన పోలీసు, రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక వ్యవస్థలలోని మహానుభావులకు త్యాగధనులకు, నమ్రతతో శిరస్సు వంచి ఈ కథా వస్తువును అంకితం ఇస్తున్నాను.

**– ఆచార్య శేషయ్య కందమూరు,** పిహెచ్.డి.

**ఏది ఏమైనా కాదనలేని పరమ సత్యం :**

**నేటి సమాజంలో ప్రస్తుత ప్రజాస్వామ్య రాజ్యాంగం, ప్రజలు, రాజకీయ నాయకులు, ఓటర్లు సుడిగుండంలో చిక్కుకొని అతలా కుతలం అవుతున్నారు.**

# మేలుకొలుపు

నాడు దాస్యశృంఖలం
నేడు విశృంఖలం
ఇదే మన భారతం.
ఎందరో మహానుభావుల
తపోశక్తితో పునీతమై
పవిత్రనదుల నాల్గువేదాల
గీతా ఇతిహాసాలతో
ప్రపంచానికే తలమానికమైన
పుణ్యభూమి మన భారతావని.
మరి నేడో
తోడేలు బాబాలతో
నక్క రాజకీయాలతో
దొంగ వ్యాపారాలతో
దోపిడీ వృత్తులతో
మానవజాతి కలుషితమైన
కుళ్ళు ప్రపంచంలో
కాటిలో కాలుపెట్టినట్లు
సామాన్యుడు నిత్యం
సతమత మవుతున్నాడు.
కొడిగడుతున్న విలువల్ని
కనుమరుగవనీకుండా
సమాజాన్ని జాగృతం చేసే
అత్యున్నత మార్పుకోసం
కామర్సు ఆచార్యులు
కలానికి పదునుపెట్టారు.
బోధన ప్రతిభే కాదు
అద్భుత రచనలకు
శ్రీకారం చుట్టారు
ఆచార్య కందమూరు శేషయ్య.
నాడు క్లాసుకే పరిమితమైన
తన విజ్ఞాన మేధస్సు
నేడు విలక్షణ రచనలతో
ప్రపంచాన్ని చైతన్యం చేస్తోంది.
తన సృజనాత్మక శైలితో
ఆయన ఆవిష్కరించిన
'జగన్నాటకం'
ప్రజాక్షేత్రంలో దాగివున్న
రాక్షసగణాల్ని
కళ్ళెదుట నిలిపింది
అంతరిస్తున్న విలువల్ని
సద్విమర్శ చేసి
రాజ్యాంగం ఔన్నత్యానికి
కొత్త భాష్యం చెప్పింది.
ఇదో చిన్న నవల
అనుకుంటే పెద్ద పొరపాటే.
అనుభవాన్ని కాచివడపోసి
సహజ శైలితో శుద్ధిచేసి
మాధుర్యాన్ని రంగరించిన
సాహిత్య గుళిక.
సమకాలీన ప్రపంచానికి
భావి భారతానికి
'జగన్నాటకం'
ఓ మేలుకొలుపు.
తెలుగు సాహితీవనంలో
ఓ తులసిమొక్క.
అందించిన గురుపూజ్యులకు
ఆ తిరుమలేశుని శుభాశీస్సులు.

**– డా॥ సూరపరాజు కిషోర్ కుమార్**
అడ్వకేట్ (ఆం.ప్ర. హైకోర్టు)

# నూతన రాజ్యాంగ విధి విధానాలు

## ( సాధన సహిత సమాధానం )

**మంచి రాజ్యాంగం, మంచి రాజకీయ నాయకులు,**
**మంచి ప్రభుత్వం లేకుండా, ప్రజాస్వామ్య**
**హక్కులతో విధులతో, సమన్యాయాన్ని**
**సమతౌల్యాన్ని కల్పించడం అసాధ్యం.**

**ప్రస్తుత భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య**
**ప్రభుత్వం ప్రచ్ఛన్న నియంతృత్వం.**

### సామాజిక సాగరమథనం

సామాజిక సంసార సముద్రంలో ప్రజలు తమ జీవితాల మనుగడకు అనేక మథనాలు జరుపుతుంటారు. దీనిని సింబాలిక్‌గా చూడాలంటే క్షీర సాగరమథనాన్ని తలపునకు తెచ్చుకోవాలి. నేడు అన్నిరకాల పార్టీల, వ్యక్తుల, వర్గాల, వృత్తుల మధ్య ధనం, అధికారం, సుఖం అన్న అమృతం కోసం చేస్తున్న ఘర్షణలు క్షీర సాగరమథనాన్ని ప్రతిబింబింపజేస్తాయి. భాగవతంలోని అష్టమ స్కంధములో క్షీర సాగరమథనంలో, తాను ప్రసాదించిన పూలదండను ఐరావతం ఏనుగు తుంచివేసిన కారణంగా దూర్వాసుని శాపం క్షీర సాగర మథనానికి నాంది ప్రస్తావన జరిగి, మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకి సర్పాన్ని త్రాడుగా త్రిప్పేందుకు అనువుగా ఉండేందుకు దేవతలు రాక్షసులు తలవైపు కాళ్ళవైపు నిలిచి, శ్రీమహావిష్ణువు మహా కూర్మం ఆధారంతో చిలకడం ప్రారంభమైంది.

క్షీర సాగరమధనంలో ముందుగా హాలాహలం ఉద్భవించింది. దానిని మహాదేవుడు స్వీకరించాడు. తరువాత ఉద్భవించిన కామధేనువును ఋషులకు, ఉచ్చైశ్రవాన్ని బలిచక్రవర్తికి, తదుపరి పారిజాతం అప్సరసలు లక్ష్మీదేవి ఉద్భవం జరిగింది. లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువు వక్షస్థలాన్ని అలంకరించింది.

ప్రస్తుత ప్రజాస్వామ్య మధనంలో ప్రముఖంగా ఉద్భవించేవి, హాలాహలం అమృతం లక్ష్మి. అమృతం అనగా అధికారం. లక్ష్మి అనగా ధనం. అయితే ఎవరు ఏ ఏ పాత్రలు పోషిస్తున్నారు, ఎవరు దేనిని స్వీకరిస్తున్నారు అన్నది సందర్భసహితం. నేడు అధికార పార్టీలు, ప్రతిపక్ష పార్టీలు తమ పాత్రలను దేవతలుగా రాక్షసులుగా అధికారాన్ని లక్ష్మిని హస్తగతం చేసుకునే పరిస్థితిని బట్టి మార్చుకుంటుంటారు. వాళ్ళ లక్ష్యం లక్ష్మిని అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే.

అయితే వీటన్నిటికి మూలమైన హాలాహలాన్ని స్వీకరిస్తూ ఈ ప్రక్రియను కొన సాగించేందుకు రుద్రరూపులుగా ఉంటున్నవారు, నైతికతతో ధర్మాన్ని న్యాయాన్ని రక్షించాలనే లక్ష్యసాధనతో జీవితాలను అర్పణచేస్తున్న ప్రజలు, రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తలు, అధికారగణాలు, భగవాన్‌లు. ఈ భూమి మీద ఇలాంటి మహానుభావులు లేకుంటే కనీసం ఈ స్థితిలోనైనా ప్రజాస్వామ్యం మనుగడ నిలబడి వుండేదికాదు.

*

# భూమిక

కర్మభూమిగా పేరుగాంచి ప్రపంచంలోని అనేక దేశాల వ్యక్తుల మన్ననలను నేటికీ పొందుతున్న ప్రస్తుత భారతదేశ రాజ్యాంగానికి కాలపరిమితి దాటిపోయింది.

కర్మభూమి అనగా ధార్మికతతో, నైతికతతో, సంస్కృతితో, సభ్యతతో కూడిన ప్రవర్తన కలిగి రాజ్యాంగ చట్టాలతో శిక్షాస్మృతులతో, రాజకీయ నాయకుల ప్రభుత్వ వర్గాల మధ్య ప్రజలకు సమన్యాయంతో, సమానత్వంతో జరిగే మానవజాతి పరిపాలన వ్యవస్థ.

మంచి సంస్కృతి అనగా గాలినిచ్చి, నీడనిచ్చి, పూవునిచ్చి, పండ్లనిచ్చి, కలపనిచ్చి, వర్షాన్నిచ్చి మరల విత్తును తయారుచేసి తనంతదానిగా చేయగలిగిన చెట్టులా ఆలోచన ఆచరణ ఉండడం. అలా కాక, చెట్టును గొడ్డలికి ఎరవేసి బలిచేసి, పువ్వుకు చీడ పట్టించి, పిందెను తుంచేసి, చెట్టును నిరాదరణకు బలిచేయడం కాదు.

భారత రాజ్యాంగాన్ని తయారుచేసి 70 సంవత్సరాలవుతున్నది. ఇది యాంత్రిక యుగం. ఇది రోబోట్లతో పనిచేసే యుగం. ప్రతి వృత్తిలో కొత్త కొత్త యాంత్రిక పరికరాల ద్వారా మానవుని శ్రమను 25 శాతానికి పడిపో యేట్టు మార్పులు జరుగుతున్న యుగం. నేడు ఒక వ్యక్తి క్షణకాలంలో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యక్తితో మాట్లాడగలడు, చూడగలడు, రవాణా, సమాచార ప్రసారం చేయగలడు.

అమెరికా నుండి 150 సంవత్సరాల క్రిందట (1865) అబ్రహం లింకన్ మరణవార్త ఇంగ్లాండుకు చేరేందుకు 18 రోజులు పట్టింది. నేడు మానవుడు గ్రహాంతర కక్ష్యలను దాటి చంద్రుని మీద సుఖనివాసం చేయాలని ఆలోచిస్తున్నాడు. నిజానికి రాజకీయ వ్యవస్థ, రాజ్యాంగ వ్యవస్థకు చట్టాలకు శిక్షా స్మృతులకు ప్రభుత్వ వర్గాలకు లోబడి పనిచేయాలి. అంటే గుర్రాన్ని బండికి ముందు వైపు కట్టాలి. అలా కాకుండా బండిని ముందు పెట్టి గుర్రాన్ని వెనుక నిలబెడితే వ్యక్తులు వ్యవస్థలు చిన్నాభిన్నమైపోతాయి.

ప్రకృతి క్రమశిక్షణకు మారుపేరు. మానవుడు క్రమశిక్షణ లేక బలీయమైన స్వార్థంతో బ్రతుకు సాగిస్తున్నాడు. అనగా వ్యక్తులు అగ్నిలాంటి స్వార్థపూరిత కోరికకు ఆజ్యంపోసి తృప్తిపరచాలని ప్రయత్నించి చివరకు కృతఘ్నులుగా నిలిచిపోతున్నారు. ప్రకృతి నుండి పొందిన దానికి ప్రతిఫలం ఇవ్వడం కృతజ్ఞత. అదే మానవునికి భగవద్గీతలో, బైబిల్లో, ఖురాన్‌ల్లో ప్రవచించిన ప్రేమ, ధర్మం, కర్తవ్యం, బాధ్యత యొక్క సారాంశం.

మానవులు జంతువుల స్థితినుండి ఎదిగి మునులు ఋషులు అయి తపస్సు చేసి వేదాలు ఉపనిషత్తులు భాష్యాలు పురాణాల వంటి గ్రంథాలను రచించి, యజ్ఞయాగాదులు నిర్వహించి రాజులకు మార్గదర్శకులయినారు.

కాని ప్రస్తుత ప్రజాస్వామ్యం కొండంత రాగం తీసి తుమ్మదియ్యలో అన్నట్టు! ఇంత బ్రతుకు బ్రతికి ఇంటివెనక చచ్చినట్టు! నూరు తుఫానులకు తట్టుకున్న బారువ ఒక తుఫానుకు మరణించినట్టు! సువిశాలమైన పడవ చిన్న రంధ్రంతో మునిగినట్టు! బలవంతుడు శ్వాస అందక చచ్చినట్టు! ఒకే ఒక ఓటుతో బొమ్మా బొరుసు అవుతున్నది.

ప్రజాసామ్యంలో ఉన్న ధర్మసూక్ష్మాన్ని రక్షించుకునేందుకు రాజ్యాంగం ఎంతో సున్నితంగా ఉండి, అంతే దృఢత్వాన్ని కలిగి ఉండాలి. “జంతూనాం నరజన్మ దుర్లభం!” అన్న శంకర భగవత్ పాదుల మాటలను “జంతూనాం నరజన్మ అధమం” అని సరిదిద్దుకోవలసిన దౌర్భాగ్యం పట్టింది!

నేటి గొప్ప పారిశ్రామిక వేత్తలు, రాజకీయవేత్తలు, బ్యూరోక్రాట్స్, సినీరంగ ప్రముఖులు, ఎంట్రాప్రన్యూర్స్ చరిత్ర పుటలు తిరగవేస్తే, 30-40 సంవత్సరాల క్రిందట గొడుగులు రిపేర్లు చేసుకుంటూ, గుండీలు కుట్టుకుంటూ, కూలీలుగా పనిచేస్తూ, తాపీ పనివాళ్ళుగా ఉంటూ, బజ్జీలు అమ్ముకుంటూ, పుస్తకాలు బైండింగ్ చేసుకుంటూ, పార్టీ కార్యకర్తలుగా పనిచేస్తూ, కండక్టర్లుగా, డ్రైవర్లుగా, బస్సుల్లో లోడర్లుగా, ఫ్యాక్టరీ కూలీలుగా పనిచేస్తూ అవకాశాలను చేజిక్కించుకుని కృషిపైన నమ్మకం ఉంచుకొని, శ్రద్ధతో ప్రేరణతో తపనతో శ్రమించి అభివృద్ధి పథంలో పయనించి సమాజపు గుర్తింపు పొందిన వారే.

ఈ విషయాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలంటే వ్యక్తుల, కుటుంబాల, సమాజాల, దేశాల పురోగతికి, తిరోగతికి కారణం కేవలం ప్రేరణ (మోటివేషన్) మాత్రమే. నేటి స్వామీజీల, రాజకీయ నాయకుల, వ్యాపారవేత్తల చరిత్రను గమనిస్తే ఈ విషయం అర్థమౌతుంది. డేవిడ్ మెక్లీల్యాండ్ అన్న మహానుభావుడు 'అచీవింగ్ సొసైటి' అనే గ్రంథాన్ని 20వ శతాబ్దంలో రాశాడు. విచిత్రమేమిటంటే సొసైటీ అనే పదం చివరన వుంచి అదే శతాబ్దంలో 3 గ్రంథాలు వెలువడ్డాయి. టానే రాసిన అక్విజిటివ్ సొసైటి', గాల్‌బ్రెత్ రాసిన అఫ్లుయంట్ సొసైటి', డేవిడ్ మెక్లీల్యాండ్ అచీవింగ్ సొసైటీ. ఈ మూడు పుస్తకాలు ఈనాటికి కూడా,సమాజానికి దిక్సూచిలుగా ఉపయోగపడుతున్నాయి.

మెక్లీల్యాండ్ రాసిన 'అచీవింగ్ సొసైటీ' పుస్తకంలో ఎన్ని వనరులు ఉన్నా, ఎన్ని శక్తి సామర్థ్యాలు ఉన్నా, ఎన్ని వసతులు ఉన్నా, ఎన్ని సంపదలు ఉన్నా, ఉత్సాహ సంపద లేకపోతే అవన్నీ బూడిదలో పోసిన పన్నీరై, సముద్రంలో కురిసిన వర్షమై, అడవి కాచిన వెన్నెలై వృథా అవుతాయి. కావున మానవుని అభివృద్ధికి మూలాధారం ప్రేరణ (మోటివేషన్), ఉత్సాహం, తపన. అందుచేత రాజ్యాంగం ద్వారా భౌతిక వసతులతో పాటు ప్రేరణకు కావలసిన శిక్షణను అందించలేకపోతే సమాజాలు అభివృద్ధి చెందవు. అభివృద్ధి సాధించిన వ్యక్తులు, కుటుంబాలు, సమాజాలు కూడా నిలువునా కుప్పకూలిపోతాయి అన్నది చరిత్ర పాఠ్యాంశం.

భారతదేశపు ప్రజాస్వామ్యం 7 మతాలు, 122 భాషలు, 1600 మాండలీకాలు, అనేక వర్ణాలు, వృత్తులు, ఆచార వ్యవహారాలు, కుటుంబ సంబంధ బాంధవ్యాలతో, 5 వేల సంవత్సరాల నాగరికతను ఆధ్యాత్మికతను తన స్వంతం చేసుకొన్నప్పటికీ బీదరికం, దారిద్ర్యం, కులవివక్షతతో ఇబ్బంది పడుతున్నది. 1950 దశకంలో 53+ పార్టీలతో ఎలక్షన్ కమీషన్ చేత గుర్తింపబడి, ప్రస్తుతం ఏడు జాతీయ పార్టీలు, 1866 ప్రాంతీయ పార్టీలతో అలరారుతున్నది. ఈ పార్టీలు తమ తమ సిద్ధాంతాలతో భిన్నత్వంలో ఏకత్వం ఉన్నట్టు మాట్లాడుతూ నటిస్తుంటారు.

నేటి రాజకీయవ్యవస్థ, ప్రస్తుత రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని నీతిని న్యాయాన్నీ ధర్మాన్నీ పక్కకు నెట్టి, తమ పబ్బం గడుపుకుంటూ ఉన్నందున చివరకు విద్యావంతులైన యువత కూడా రౌడియిజానికీ, దొంగతనాలకు, అత్యాచారాలకు, హత్యలకు, పోకిరి చేష్టలకు, అసాంఘిక చర్యలకు మొగ్గుచూపుతున్నారు.

ప్రజాస్వామ్యంలో అధికారం కట్టబెట్టేదీ, అధికారం నుండి తొలగించేదీ ఓటరే. ఓటరు జీవునికి గాలి లాంటివాడు. చెట్టుకు తల్లి వేరులాంటివాడు. రాజ్యాంగానికి మూలపురుషుడు. నీతివంతమైన ఓటరు లేకపోతే, రాజ్యాంగ ప్రజాస్వామ్యం బండిచక్రాలు, బురదలో ఇరుక్కొని ఎంత వేగం పెంచినా అక్కడే తిరుగుతున్నట్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో ప్రతి మనిషికి స్థితిగతులకు అతీతంగా ఒకే ఒక ఓటు ఉంటుంది. అయితే సంధర్భాన్ని అనుసరించి ఒక ఓటు విలువ వేల లక్షల ఓట్లకు సమనమయ్యే పరిస్థితి ప్రజాస్వామ్య ఎలక్షన్‌లలో ఏర్పడవచ్చు. అనేకమంది అభ్యర్థులు అనేకసార్లు అనేక ఎలక్షన్లలో ఒక ఓటు మెజారిటీతో గెలిచిన సందర్భాలు అనేకం. ఒక మనిషి విలువ అనేకమందిని శాసించలేక పోవచ్చు. కాని ఆ మనిషి యొక్క ఓటు గెలుపును ఓటమిని శాసించే అధికారాన్ని కలిగి ఉంటుంది. అనగా క్షణాల్లో మనిషి విలువ తన ఓటుతో మారే అవకాశం ఉంటుంది.

భారతదేశంలో పార్టీలు పుట్టగొడుగులలా ఉన్న కారణంగా 51 శాతం ప్రజల అంగీకారంతో అధికారంలోకి రావడం వీలుకాదు. ప్రస్తుతం కేవలం 30 శాతం మైనారిటీ అంగీకారంతో, 70 శాతం ఓటర్ల తిరస్కారంతో అధికారాన్ని అందిపుచ్చుకునే పరిస్థితి. దీనికంతటికి కారణం రాజకీయ పార్టీల మధ్య అసమానత వలననే. అసలు మెజారిటీ, మైనారిటీ అన్న పదాల ఆలోచనలు సమాజాన్ని నాశనం చేశాయి. మెజారిటీ కొంతమందికే పరిమితం. అది అందరిది కాదు. మెజారిటీ నుండి సర్వజనులకు అన్న నినాదం వైపుకు ప్రయాణం జరగవలసిన అవసరం ఉంది.

అన్ని పార్టీల లక్ష్యం అభివృద్ధి అయినప్పుడు అనేక పార్టీలు స్థాపించడం, అభివృద్ధికి సమానత్వానికి, న్యాయానికి సమాధులు కట్టడమే కదా! ప్రతిపక్షపార్టీల

మెంబర్లు పబ్లిక్ మీటింగులనుండి, అసెంబ్లీవరకు ప్రజాస్వామ్య సమస్యలను చర్చించకుండా వ్యక్తి దూషణలతో, బూతు పంచాంగాలు చదువుతూ, నీచంగా ప్రవర్తించడంతో యువతకు ఎలాంటి సంకేతాలు, ప్రవర్తనావళి పద్ధతులు చేరుతున్నాయి అనేది ఆత్మ విమర్శ చేసుకుంటే తప్ప అర్థం కాదు. రాజకీయపార్టీల నాయకుల బలహీనత, అధికార పార్టీ 'అవును' అంటే, ప్రతిపక్ష పార్టీలు 'కాదు' అని అనడం. అక్కడ మంచికి చెడ్డకు న్యాయానికి అన్యాయానికి తావులేదు. 'అవును' 'కాదు' ల మధ్య ఘర్షణ మాత్రమే మిగిలి ఉంటుంది.

ఆ కారణంగా రాజకీయ నాయకుని స్వార్థ చింతనకు ఓటరు తన అవసరాలను ప్రలోభాలను ఆవేశాలను అభిమానాలను ఆధారం చేసుకొని తన ఓటును తూటాలా కళ్ళు మూసుకొని వదులుతాడు. దానికి శాస్త్రీయత, తర్కం, తత్వం అంటూ ఏమి ఉండదు. ఓటర్లు రాజకీయనాయకులు చేస్తున్న అన్యాయానికి తాము చేస్తున్నది న్యాయం అని భావిస్తున్నారు. ఆ కారణంగా ఆహార భద్రతను, ఉద్యోగ భద్రతను, పని భద్రతను, ఆరోగ్య భద్రత లాంటి వాటిని అన్నింటినీ ఉపయోగించుకుంటున్నాడు. పైగా అన్ని పార్టీల నుండి డబ్బులు పుచ్చుకొని, ఎవరికీ మెజారిటీ రాకుండా, అత్తెసరు అధికారంతో సరిపెట్టడానికి వాళ్ళ తెలివితేటలు ఒకవైపు, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు మరొకవైపు, పనిచేస్తుంటాయి. దీంతో సామాజిక రాజకీయ ఆర్థిక వ్యవస్థ తప్పటడుగులు వేస్తున్నది.

రాజుగారి 'పట్టువస్త్రాలు' కథలో "రాజుకు రాణికి గుడ్డలు లేవు, దిగంబరంగా ఉన్నారు" అన్న చిన్నపిల్లాడి చందాన రచయిత ప్రస్తుత ప్రజాస్వామ్యం 'ధర్మం' 'న్యాయం' 'సమానత' అనే వస్త్రాలు లేక నగ్నంగా ఉన్నదని చెబుతున్నాడు. అనగా భారత రాజ్యాంగం, సమన్యాయం, సమానత్వ ప్రాతిపాదిక మీద నడవడం లేదు.

విష్ణుశర్మ 2000 సంవత్సరాల క్రిందట పంచతంత్రంలో జంతువుల చేత చెప్పించిన మాటా రాజు యొక్క కర్తవ్యం దానాలు ధర్మాలు చేయడం, కూడు గుడ్డ ఒనగూర్చడం కంటే కేవలం 'రక్షణ' కల్పించడం అత్యంత విలువైనది.

భవిష్యత్తులో మానవజాతి మనుగడ చాలా గడ్డుగా ఉండబోతున్నది. గతంలో 1950 వరకు జరిగిన యుద్ధాలు రాజ్యకాంక్షతో దురాక్రమణ కొరకు జరిగితే, 1950 నుండి మార్కెట్ యుద్ధాలు ప్రారంభమైనాయి. అమెరికా, జర్మని, రష్యా లాంటి దేశాలు తాము ఉత్పత్తి చేసిన వస్తువులను, సాంకేతికతను, మారణా యుధాలను ఇతర దేశాలకు సరఫరాజేసి ధనాన్ని సంపాదించడం వ్యాపారంగా పెట్టుకున్నారు.

ఈ క్రమంలో శతాబ్దం చివర దశకాల్లో సమాచార (ఇన్ఫర్మేషన్) యుద్ధాలు ప్రారంభమైనాయి. అనేక వస్తువులకు కాపీరైట్స్ చేసుకోవడం లాంటి కార్యక్రమాలు అమలులోకి వస్తున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలో రోబోట్స్ ద్వారా పని ఉత్పత్తులు జరిగి ఇంటలెక్చువల్ యుద్ధాల రూపంలో దర్శనమీయబోతున్నాయి. అనగా ఏ దేశంలో జ్ఞాన సంపద ఉంటే వాళ్ళు మిగతా దేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోగలిగే పరిస్థితులుతున్నాయి. ఆ కారణంగా ఏ దేశ ప్రజలు జ్ఞానాన్ని సంపాదించరో, స్వకర్మ చేయరో, పరాన్న జీవులు అవుతారో, ఆ దేశాలు చరిత్ర పటం నుండి తొలగింపబడుతాయి.

*

# మున్నుడి

ఈ పుస్తకం వ్రాయడం నా సందేహాలకు నేనే జవాబు చెప్పుకోవాలనే ఆలోచనా ప్రయత్నం మాత్రమే. ఎవరినీ ఉద్ధేశించి విమర్శ చేయాలని, కించపరచాలని నా మనసులో లేదని హృదయపూర్వకముగా తెలియజేసుకొంటున్నాను.

ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం, నాకున్న ఆలోచనలకు, అనుమానాలకు, సంధిగ్ధాలకు, అంతరాత్మ ప్రబోధించిన ఆలోచనలను కాగితాలమీదకు ఎక్కించడం జరిగింది. దీనికి వేరెవ్వరూ బాధ్యులు కారు. పరిపూర్ణంగా నేనే బాధ్యుడను.

నేను తప్పుగా వ్రాసివుంటే నన్ను నిందించండి. కాదంటే క్షమించండి. నేను రాసిన అబద్దాల నుండి ప్రత్యామ్నాయ నిజాన్ని వెలికితీసే ప్రయత్నం చేయండి. ఒప్పులు ఉన్నాయనుకుంటే ఆలోచించండి. మార్పును ఆహ్వానించండి. తప్పును సరిదిద్దే ప్రయత్నం చేయండి. ఈ సమాజాన్ని, ప్రభుత్వాన్ని ప్రశ్నించండి. మార్పుకు మీవంతు కృషి చేయండి.

ఇక్కడ వేదాంత గ్రంథంలోని సంస్కృత శ్లోకాలు, లాటిన్ భాషలోని సూక్తులు చెప్పటం లేదు. నాకు జన్మనిచ్చిన నా తల్లిదండ్రుల, గురువుల, స్నేహితుల, వేల సంవత్సరాలుగా ప్రోగు చేసి ఉంచిన మేధావుల జ్ఞానసంపద నుండి ఒక నలుసు తీసుకున్నందుకు నా మనసులోని వెలితిని పూడ్చుకోవడానికీ, నా ఆరాటాన్ని వెలిబుచ్చడానికీ కృతజ్ఞతపూర్వకంగా చేసిన ప్రయత్నం తాలూకు ఫలితం ఈ పుస్తకం.

ధార్మికతో ఆధ్యాత్మికతతో ఈ దేశానికి ఎలాంటి రాజ్యాంగం కావాలి? తద్వారా ఎలాంటి రాజకీయ నాయకుల పరిపాలన కావాలి? వీటిద్వారా ప్రజలకు ఎలాంటి న్యాయం, రక్షణ కలిగిస్తూ, ఈ రెండింటి చివరి అంచుల మధ్య న్యాయం ధర్మం సమానత్వం స్వాతంత్ర్యము సౌభ్రాతృత్వము, కృతజ్ఞతా పూర్వక దృక్పథం, భద్రత ఆదరణ శాంతి సహనంతో కూడిన వైఖరిని కలిగి ఉండాలి అన్న విషయాన్ని విశదీకరించడానికి ఎక్కడో చదివిన, ఎప్పుడో విన్న కథ ఇచ్చట ఉదహరింపబడింది.

**– ఆచార్య శేషయ్య కందమూరు**

# న్యాయ పరిపాలన

## కథ

పూర్వం ఇద్దరు రాజులు రథాలపై పొరుగు రాజ్యాల వైపు వెళ్తూ ఇరుకైన ఒక వంతెన మీద ఎదురయ్యారు. ఒక రాజు రథం వెనక్కి తీస్తే గాని రెండో రథం ముందుకు వెళ్ళే వీలులేదు. రథసారథులిద్దరూ నీ రథం వెనక్కి తీసుకెళ్ళమంటే నీ రథం తీసుకెళ్ళమని వాదించుకోవడం మొదలుపెట్టారు.

ఇద్దరు రాజులు ఏం జరుగుతుందా అని చూస్తున్నారు. చివరికి ఇద్దరు రథసారథులు ఒక ఒప్పందానికి వచ్చారు.

వాళ్ళు తమ రాజుల గొప్పతనాలను చెప్పేట్టు, అందు మీదట ఏ రాజు గొప్పవాడో ఆ రాజుకు రెండో రాజు. దారి ఇచ్చేట్టు ఒడంబడిక జరిగింది.

అందుకు మొదటి రథసారధి ఇలా అన్నాడు.

“మా రాజ్యంలో మా రాజుగారు రోజుకు వేలమంది అభాగ్యులకు ఆకలి బాధతో ఉన్నవారికి భోజనం ఏర్పాటు చేసి గాని వారు భుజించరు. వస్త్రాలు లేనివారికి రోజుకి వందల మందికి వస్త్ర ధానం చేస్తారు. అనాధ శరణాలయాలను, వృద్ధాశ్రమాలను అవసరమున్నంత మేర స్థాపించుతారు. నిరుద్యోగ భృతిని కల్పిస్తారు.

రెండో రథసారధి తలదించుకుని కంటనీరు పెట్టుకొని, రథం వెనక్కి తీయడానికి సిద్ధమయ్యాడు.

అప్పుడు దానికి ఆ రాజుగారిలా అడిగారు. “ఏమయ్యా! మీ రాజుగారికి దానగుణం లేదా? అలా ఏమీ చెప్పకుండా రథం వెనక్కి తిప్పుకుంటున్నావు. కారణం ఏమిటి?” అని అడిగాడు.

దానికి రెండో రథసారధి వినయంగా ఇలా అన్నాడు.

“మహారాజా! మా రాజుగారు దానం చేస్తుండగా చూసే అదృష్టం మా రాజ్యంలో ఎవరికీ కలుగలేదు. మా రాజ్యంలో దానం చేద్దామంటే మాకు సామాన్యులలో దీనుడు ఒక్కడూ కనబడడంలేదు. వృద్ధాశ్రమాల్లో ఉండాల్సిన అవసరము ఏనాడు ఎవ్వరికీ కలుగలేదు. ప్రతి వ్యక్తి తన శక్తికొలది పనిచేసి దానికి తగిన ప్రతిఫలం పొంది కుటుంబ వ్యవస్థను కట్టుదిట్టంగా నడుపుకుంటున్నారు. ఇక మా రాజుగారికి దానం చేసే అవకాశం గాని, ప్రజల కొరకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టడం గాని ఎలా ఉంటుంది? కాబట్టి దానం యొక్క అవసరం, అవకాశం మా రాజ్యంలో లేదు ప్రభూ! అందుచేత నా రథాన్ని వెనుకకు తీసి మీకు దారి ఇస్తున్నాను అని పలికాడు.

వెంటనే మొదటి రథంలోని రాజు క్రిందకు దిగి రెండో రాజుకు పాదాభి వందనం చేసి, తన రథం వెనక్కి తీయించి దారి ఇచ్చాడు.

వేల వృద్ధాశ్రమాలను, రాయితీలను, సంక్షేమ పథకాలను, అభాగ్యులకు సేవలను ఉచితంగా అమలు చేసే పరిస్థితులున్నా, వాటిని ఆశించే దేశ పౌరులున్న ఏ దేశము కూడా మంచిపాలనలో ఉన్నట్టు కాదు. అలాంటి దేశం పాలకుల పాలితుల దౌర్భాగ్యానికి చిహ్నం.

ఇది పూర్తిగా నా మనసులోని మాట. ఏదేశంలో నైనా సామాన్య ప్రజలు రాయితీలు అనుభవించే హీనస్థితికి దిగజారడం, గుడ్డివానికి కంటి అద్దాలు పెట్టడంలాంటిది. బియ్యం, సరుకులు, సేవలు తక్కువ ధరకి యిచ్చే ప్రభుత్వం కన్నా, శక్తి కొలది పనిచేసి దానికి తగిన ప్రతిఫలం పొంది, ఎంత ధరకైనా కొనగలిగే ప్రజలుండే ప్రభుత్వం గొప్పది. ఈ విషయం ఎన్నో రాజ్యాంగ ప్రభుత్వ విధివిధానాలకు వర్తిస్తుంది.

*

# 1. ప్రజాస్వామ్యం

అబ్రహామ్ లింకన్ చెప్పిన ప్రజాస్వామ్య నిర్వచనం – **"ప్రజల వలన, ప్రజల చేత, ప్రజల కొరకు పరిపాలన"** – ఈ దేశానికి పనికిరాదు.

ఈ దేశంలో ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత న్యాయబద్ధంగా పరిపాలించే ప్రతినిధులను ఎన్నుకొని, న్యాయమైన చట్టాలతో లక్ష్యాలతో సూత్రాలతో పద్ధతులతో, ప్రజలందరి న్యాయం కొరకు, న్యాయమైన రీతిలో పరిపాలన చేయబడే నిర్మాణక్రమం.

ఇందులో ఎవరూ ఎవరికీ ఒదిగి పోవాల్సిన అవసరం లేదు. అందరికీ సమానమైన స్వాతంత్ర్యం ఉంటుంది. కాని హక్కులు ఉండవు. వ్యక్తికి ఉన్న హక్కు తన కర్తవ్యాన్ని ఆచరించడమే. భగవద్గీతలో చెప్పిన విధంగా స్వధర్మాన్ని, స్వకర్మను, కర్తవ్యాన్ని నిర్వర్తించడం, దానికి తగిన పారితోషికం స్వీకరించడం మాత్రమే హక్కుగా పరిగణించబడుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కు విధిలోని భాగమే. దానికి ఎలాంటి ప్రత్యేకత ఉండదు. ఎవరి పనిని వారు మనసా వాచా కర్మణా నిర్వర్తించడమే హక్కు. ఎవరి విధులను వాళ్ళు సక్రమంగా నిర్వర్తిస్తే అందరూ తమ హక్కులను అనుభవించగలరు. ఎవరికి రావాల్సినది వారికి ఇతరుల నుండి అందినప్పుడు, హక్కుల కోసం పోరాడే అవసరమే ముంటుంది. హక్కుల సమస్య జనించడానికి ప్రతివాళ్ళు తమ తమ విధులను నిర్వర్తించక హక్కుల కొరకు పోరాడడమే కారణం. అధికారం బాధ్యతతో పెనవేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యం సక్రమంగా నడుస్తుంది.

బ్రిటన్, అమెరికా, అరబ్ దేశాల సంస్కృతి, రాజకీయ పార్టీల క్రమశిక్షణ, చట్టాల అమలు మనదేశంలో లేదు. మనకు చట్టాల ఆచరణలో క్రమశిక్షణ,

భయం లేదు. భారతదేశం అన్నిదేశాల ఆచార వ్యవహారాలను తనలో ఇముడ్చుకో గల దేశం. అందుకే ఈ దేశంలో ‘భిన్నత్వంలో ఏకత్వం’ ఉందని ఎలుగెత్తి చాటుతున్నారు.

హక్కులు, వ్యక్తులకు నాయకులకు వ్యవస్థలకూ సంస్థలకూ అధికార పార్టీలకు ప్రతిపక్ష పార్టీలందరికీ సమానమే. అయితే హక్కులు సమాజంలో క్రింది నుండి పైకి నడుస్తాయి. అనగా, పేద వాళ్ళ నుండి పై అంతస్తుల వారికి వర్తిస్తాయి. విధులు పైనుండి క్రిందికి దిగుతాయి. అనగా ప్రభుత్వాల నుండి సామాన్య ప్రజలకు, నీరు పల్లంలోకి ప్రయాణించినట్టు ప్రవాహానికి ఎదురీద కుండా వుంటాయి.

దీనికి మూలం ఋషి వ్యాక్యాలు. న్యాయానికి పెద్దపీట వేసి తద్వారా వ్యక్తుల హక్కులను విధులను రెండింటినీ ఒకటిగా కలిపి ‘న్యాయం’ అన్న ‘అద్వైతం’ గా ఆవిష్కరింపబడింది. న్యాయం ఉంటే మిగతా అన్నీ ఉన్నట్టే. ఏ ఒక్కటి లోపించినా న్యాయం లేనట్టే. అందుచేత న్యాయాన్ని తల్లివేరులా, ఆర్ష ధర్మంలోని రాజ్యాంగాలో నిర్దేశించారు.

**స్వస్తి ప్రజాభ్యాం పరిపాలయంతాం**
**న్యాయేనమార్గేణ మహీం మహీషాం**
**గోబ్రాహ్మణేభ్య శుభమస్తు నిత్యం**
**లోకాసమస్తా స్సుఖినోభవంతు.**

(గోవు అంటే సంపద, భూమి అనే అర్థాలు, బ్రాహ్మణ శబ్దానికి జ్ఞానం, విజ్ఞానం అనే అర్థాలున్నాయి. ఈ రెండింటినీ సమతౌల్యం చేయగల్గింది ‘న్యాయం’ మాత్రమే. అందుచేత ఋషి వాక్యాలలో, వైదిక ధర్మంలోని రాజ్యాంగానికి అనేక ప్రాథమిక హక్కులను విధులను నిర్ధారించలేదు. హక్కు విధి రెండూ కలిపితే వచ్చేది ‘న్యాయం’ మాత్రమే.


**ప్రజాస్వామ్య రాజ్యాంగంలో,**

- హక్కు న్యాయం కావాలి
- విధి న్యాయం కావాలి

- ధర్మం న్యాయం కావాలి
- సౌభ్రాతృత్వం న్యాయం కావాలి
- స్వేచ్ఛ న్యాయం కావాలి
- ఐక్యత సమగ్రత న్యాయం కావాలి
- కృతజ్ఞత న్యాయం కావాలి
- సమానత్వం న్యాయం కావాలి
- రక్షణ న్యాయం కావాలి.

అనగా నేడు న్యాయంకావాలంటే న్యాయాన్ని వృత్తం మధ్యలో ఉంచి, అన్ని హక్కులు విధులు న్యాయంవైపుకు ప్రయాణం చేయాలి. న్యాయాన్ని ఏకైక లక్ష్యం చేసుకోవాలి. దీనిని అర్థం చేసుకునేదానికి ఆదిశంకరులు ఆవిష్కరించిన పంచాయతనాన్ని, కావాలంటే అష్టాయతనంగా లేదా సప్తా... ద్వాదశాయతనంగా మార్చుకొని ఆచరించుకోవచ్చు.

## సమన్యాయం



ప్రతివ్యక్తికీ, ప్రజలందరికీ కావాల్సింది న్యాయం ఒకటే. రాజ్యాంగం సమాజానికీ చేకూర్చవలసినది 'జస్టిస్' 'న్యాయం'. ఆ న్యాయాన్ని అందించేందుకు అనేక పార్టీలు పోటీ పడవలసిన అవసరం ఉందా! న్యాయం ఒక్కటే. పార్టీలు అనేకం. వాటి మధ్య ఘర్షణలనేకం. నిజానికి న్యాయానికి అన్ని పార్టీలు పోటీపడి అన్యాయాన్ని ప్రజలకు అందించడం న్యాయమా? అది పెద్ద అన్యాయం అక్రమం ద్రోహం మోసం.

మానవుడు పుట్టినది మొదలు మరణించేంతవరకు, వ్యక్తికీ వ్యక్తికి, వ్యక్తికీ సమాజానికి, వ్యక్తికీ కుటుంబానికీ, వ్యక్తికీ పంచభూతాలకు ఉండవలసినవి న్యాయం సమతౌల్యము రక్షణ. అందుకొరకు సృష్టిలోని చరాచరము లన్నింటినీ ఒకే గొడుగు క్రిందకు తెచ్చి, ఒకదాని వలన మరొక దానికి నష్టం లేకుండా కష్టం కలుగకుండా చూడడం 'రక్షణ'. రక్షణ ఉండడం అంటే సమతౌల్యము ఉండడం. సమతౌల్యము ఉండడం అంటే సమానత్వం ఉండడం. సమానత్వం ఉన్నప్పుడు, ఒకరికొకరు తోడు నీడగ ఉన్నారనీ, స్వతంత్రతతో ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతుకుతూ కలసి కట్టుగా సోదర భావంతో ఉన్నారనీ, దీన్ని అంతా ఒకేచోట పోగుచేస్తే వచ్చే ఫలితం న్యాయం!

భారతంలో వ్యాసుడు, జీసెస్, జరత్రుష్ట అందరు చెప్పింది. "నీకు ఇతరులు చేసిన పని అప్రియమని తోస్తే దానిని నీవు ఇతరులకు చేయకూడదు". నీ మీద ఇతరులు పూలు చల్లాలి. నీవు మాత్రం వాళ్ళ మీద రాళ్ళు విసరాలి అన్నది న్యాయం కాదు. అది జీసస్ మీద రాళ్ళు విసిరినట్టు వుంటుంది.

ప్రస్తుతం రాజకీయ పార్టీలు, తల్లిపాత్రను పోషిస్తూ ఓట్లకోసం ప్రజలకు గోరుముద్దలు తినిపిస్తున్నది. కాని తండ్రిలా రక్షణ కల్పించడం మరిచిపోతున్నది.

నేటి ప్రజాస్వామ్యంలో, రాజకీయ నాయకులు వ్యాపారవేత్తల ముసుగులలో జీవిస్తూ, బ్యూరోక్రాట్స్ వ్యాపారవేత్తల రాజకీయ నాయకుల ముసుగులలో జీవిస్తూ, వ్యాపారవేత్తలు మిగతావాళ్ళ ముసుగులలో నటిస్తూ ఉండేందుకు అవకాశాలను కల్పిస్తున్నది. ప్రజలు ఏదో ఒక నైపుణ్యాన్ని సంపాదించుకుని వృత్తిధర్మాన్ని, కర్తవ్యాన్ని నిర్వర్తించే వాళ్ళ శాతం కంటే, జులాయిలు నేరస్థులు రౌడీలు దొంగలు

హంతకులు అత్యాచారం చేసేవాళ్ళుగా చలామణి అవుతూ బ్రతుకుతున్న వారి శాతం ఎక్కువ. దొరికితే జైలుకు వెళ్ళి విశ్రాంతి తీసుకుని, వచ్చి మరలా తమ వృత్తిని ఇంకా మెరుగ్గా చేయడం ఆనవాయితీ అయింది.

వీళ్ళలో కొందరు కర్తవ్య నిర్వహణ చేయవలసిన రాజకీయ వ్యాపారవేత్తల వద్ద పరాన్నజీవులుగా బ్రతుకుతున్నారు. అందువలన దేశంలో 20 శాతం ప్రజలు కష్టపడి పనిచేస్తుంటే, 80 శాతం ప్రజలు ఏదో ఒక రీతిలో సోమరులుగా, కష్టపడకుండా సంపాదించాలనే ఆలోచనలతో జీవితాలను గడుపుతున్నారు. ఇది **"ప్యారిటో సిద్ధాంతం".** కావున నేటి చట్టాలు ట్రాన్స్‌పరెంట్‌గా లేక **"ఇంక్లూసీవ్ గ్రోత్"** కంటే **"ఎక్స్‌క్లూసివ్ గ్రోత్"** ఎక్కువైపోతున్నది. తద్వారా అసమానత పెరుగుతున్నది. సమన్యాయం లేని రాజ్యాంగం, గవర్నెన్స్, నేతి బీరకాయల లాంటివి.

రాజకీయ నాయకులు కావడానికీ, బలపడడానికీ కావలసిన అర్హతలు, అవినీతి కుంభకోణంలో స్నానమాచరించడం, లంచాల విబూది పూసుకోవడం, అవినీతి ప్రవచనాలు ఇవ్వడం, నీతి నియమం మీద, ప్రజాస్వామ్యం మీద పవిత్ర వాక్యాలు వల్లించడం, తమని ఇతరుల నుండి రక్షించుకోవడానికీ, తమ అత్యాచారాలను కొమ్ముకాయటానికీ పరివారాన్ని తయారుచేసుకోవడం.

ఆ కారణంగా వాళ్ళల్లో మేధావులుగా, ఉపాధ్యాయులుగా, ఆర్టిస్టులుగా, వ్యాపార వేత్తలుగా, సమాజ సేకులుగా ఉపయోగపడవలసిన ఎందరినో, వీళ్ళ అనుచరులుగా చేసుకొని, మిగతా పార్టీనాయకుల అనుచరగణంతో శతృత్వాన్ని పెంచుకొని రౌడీయిజం, కొట్లాటలు, అవినీతి, హత్యలు, మానభంగాలు లాంటి కేసుల్లో వాళ్ళను ఇరింకించి, దుర్వ్యసనాలకు లోబరచి వాటినుండి బయట పడలేక, వాళ్లు సమాజంలో దుర్మార్గులనే ముద్రను వేసుకుంటున్నారు.

చివరకు వాళ్ళకు మిగిలేవి: 1) ప్రాయశ్చిత్తం లేని పశ్చాత్తాపం. 2) తమకు తాగించే సారాయి, తినిపించే బిర్యాని, చిల్లర ఖర్చులకు డబ్బులు. వీళ్ళ కారణంగా వాళ్ళ కుటుంబాలు అన్ని రకాల అవస్థలకు లోనవుతున్నాయి. వీళ్ళ జీవితం మాయలఫకీర్ చేతిలోని చిలక ప్రాణం లాగుంటుంది.

రాజకీయ నాయకుల వెనువెంబడే పారిశ్రామిక వేత్తలు దర్శనమిస్తారు. వ్యాపారవేత్తల వద్ద ఉన్నది 'ధనం'. 'ధనం మూలమిదం జగత్!' 'కాసులు గలవాడె రాజు గదరా సుమతి!' తరువాతి వర్గము అధికారులు. వారి వద్ద ఉన్నది అధికారముద్ర. రాజకీయ పారిశ్రామిక వేత్తల తదుపరి వర్గము బాబాలు. వాళ్ళ దగ్గర ఉన్న పాశుపతాస్త్రం భక్తి. కాని ఎవ రి అస్త్ర శస్త్రాలు దైవాంశ సంభూతులని, దేవుని సంతానం అని భావించే బాబాల దగ్గర పనిచేయవు. వీళ్ళందరూ స్వామీజీల అడుగులకు మడుగులు వత్తుతుంటారు. ఎలాగైతేనేమి వీళ్ళందరి మధ్య పరస్పర అవగాహన సంబంధం ఉంటుంది. ఒకరు లేకుండా మరొకరు బ్రతకలేరు.

వ్యాపార రంగాల్లో, వస్తుసేవల ఉత్పత్తి సరఫరాల్లో ఎన్నో గుణగణాలను ప్రమాణాలను విధిస్తారు. వాటిని అనుసరించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకొనే అధికారాలు ఉన్నాయి. ఉద్యోగంలో పొరపాట్లు చేస్తే ఆడిట్ డిపార్ట్‌మెంటు చర్యలు తీసుకునే చట్టాలు ఉన్నాయి. కాని రాజకీయాల్లో, ఆశ్రమాల్లో ఇలాంటి ప్రమాణాలు, చర్యలు ఉన్నాయా? వారు చేసే కార్యక్రమాలకు ఎలాంటి ప్రభుత్వ ఆడిట్, అకౌంటబులిటీ లేదు. దానికి ప్రత్యేక శిక్షాస్మృతి ఉన్నా అధికారం వాళ్ళ దగ్గరే ఉంటుంది కాబట్టి అడిగేవారు లేరు. చెప్పేవారు లేరు. ఇది అన్యాయం, అసమానత.

నేటి స్వామిజీల ఆశ్రమాలలో, చాలామంది మాతృభాషతో కలిపి ఇంగ్లీష్, ఇతర భాషలలో ప్రవచనాలు చెప్తూ, వందల ఎకరాల్లో స్థాయిల వారికి అన్ని వసతులను ఏర్పాటుచేస్తూ, ముఖ్యంగా ఇతర దేశస్తులు విరక్తితో దిక్కుతోచక ఈ దేశానికి వస్తే వాళ్ళకు ధ్యానం, సమాధి స్థితి, యోగాసనాలు, ప్రాణాయామం లాంటి అనేక ప్రక్రియలతో ఆకర్షించి సొమ్ము చేసుకుంటూ, పలుకుబడిని సంపాదించుకుని ప్రపంచంలో అనేక దేశాల్లో స్వదేశంలోని అనేక రాష్ట్రాల్లో, ఆశ్రమ బ్రాంచీలను ప్రారంభించడం వాళ్ళ నిత్యకృత్యాలు.

స్వామిజీలు ఆశ్రమాలను పెట్టినంత సులువుగా మానవ సంబంధాలమీద, రాజకీయ నాయకులకు రాజనీతిని అనుసరించేందుకు వలసిన కౌన్సిలింగ్ సెంటర్‌లను, చిన్నపిల్లలకు విద్యాసంస్థలను, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆసుపత్రులను, దిక్కులేని వాళ్ళకు ఉచితంగా భోజన వసతి సదుపాయాలను కల్పించేందుకు తాము భక్తుల నుండీ దోచుకుని దాచుకున్నదాంట్లోనుండీ వెచ్చించడం, వాళ్ళ అంతరాంతరాలలో దివిటి పెట్టి వెతికినా కానరాదు. నిరంతరం

తేనెపలుకులతో, వాళ్ళభక్తులకు నచ్చే విధంగా ప్రసంగాలు చేయడం సొమ్ము సంపాదించుకోవడం.

అసలు ఆశ్రమాల అవతవతకలకు స్వామీజీలు ఎంత బాధ్యులో, భక్తులు కూడా అంతే బాధ్యులు. ఏ కొద్దిమందినో మినహాయిస్తే బాబాల చుట్టూ తిరిగే భక్తులందరూ తమ  వనరులకు మించి తమ పరిధిలో ఉన్నవాళ్ళందరి కంటే ఎత్తుకు ఎదగాలన్న దురాశతో బాబాలను ఆశ్రయిస్తారు. అది వాళ్ళ అమాకత్వం, తెలియనితనం. అందుచేత వాళ్ళు క్షమార్హులు. కాని భక్తుల బలహీనతలను తెలిసి వాటిని ఆసరాగా చేసుకొని తప్పులు చేసే బాబాలు మాత్రం శిక్షార్హులే.

స్వామీజీలు తలచుకుంటే భక్తులను సచ్ఛీలురుగా తయారుచేసి, వారి ద్వారా విద్యార్థులకు విద్యాదానం, ఆకలితో అలమటించే వారికి అన్నదానం, తలదాచుకొనే దానికి వసతి లాంటి ప్రాథమిక అవసరాలను వేలవేల కోట్లు మాడిగల్లో దాచిపెట్టిన దాంతో, తమ ఆజ్ఞను శిరసా వహించే భక్తుల సంపదలతో ఎన్నో సామాజిక సమస్యలను అధిగమించి నవభారత నిర్మాణానికి శ్రీకారం చుట్టగలరు.

గతంలోని దేవాలయాలు ద్వారా చేసిన సామాజిక కార్యక్రమాలు వంటి పనులు చేస్తే, అతి సామాన్యుల ఖాతాలోకి జమచేయబడతారని, వాళ్ళ దగ్గర ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయన్న నమ్మకాన్ని కలిగిస్తూ ఆడిన నాటకాలకు తెరపడుతుందని భయం. ప్రపంచమంతా, వీరు గొప్ప ఆధ్యాత్మిక పురుషులు, దైవశక్తిని చేజిక్కించుకున్న వారు, భగవత్ స్వరూపులు అని అందరూ నమ్మాలని వీరి  దురాశ.

అసలు ఆశ్రమాల అవతవతకలకు స్వామీజీలు ఎంత బాధ్యులో, భక్తులు కూడా అంతే బాధ్యులు. ఏ కొద్దిమందినో మినహాయిస్తే బాబాల చుట్టూ తిరిగే భక్తులందరూ తమ  వనరులకు మించి తమ పరిధిలో ఉన్నవాళ్ళందరి కంటే ఎత్తుకు ఎదగాలన్న దురాశతో బాబాలను ఆశ్రయిస్తారు. అది వాళ్ళ అమాకత్వం, తెలియనితనం. అందుచేత వాళ్ళు క్షమార్హులు. కాని భక్తుల బలహీనతలను తెలిసి వాటిని ఆసరాగా చేసుకొని తప్పులు చేసే బాబాలు మాత్రం శిక్షార్హులే.

*

# 2. సామాజిక సమస్యలు

ఏడు పదులుగా ప్రపంచంలో అందరూ మెచ్చుకునే రాజ్యాంగం అయి వుండి అనేక పార్టీలు గద్దెక్కి గద్దెదిగినప్పటకీ, నిరక్షరాస్యత, అనారోగ్యం, స్త్రీలపై అత్యాచారాలు, గృహవసతిలేని కుటుంబాలు, నీటికోసం కటకటలు, ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులు, నిజాయితీ లేని పార్టీలు, అవినీతిని ఆలంబనగా చేసుకున్న రాజకీయ నాయకులు, కులాల కుంపట్లను రాజేస్తున్న పెద్దలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలన్నింటికీ ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధించినది జనాభా పెరుగుదల.

దేశంలో వెయ్యి టీ.వి. ఛానళ్ళు, వేల వార్తాపత్రికలు, లక్షల మంది నాయకులు ఉన్నారు. కాని జనాభా సమస్యలు అవసరాలు విద్య వైద్యం, ఆరోగ్యం ఆహారం, నీరు నిప్పు, విద్యుచ్ఛక్తి సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం ప్రేరణ, సుఖంగా బ్రతకాలనే దృక్పథం మూలాల కొరతను గురించి ప్రసార మాధ్యమాల్లో, నాయకుల మాటలలో మచ్చుకు కూడా కానరావు. రాజకీయ నాయకులు, దేశ జనాభా సమస్యలను, స్త్రీ పురుషుల నిష్పత్తి, వయోవృద్ధుల నిష్పత్తి వంటి సమస్యలు సమాధానాలు పరిష్కారాలను గురించి ఏ ఒక్కరూ ప్రస్తావన చేయరు. జనాభాను నియంత్రిస్తాం అని మ్యానిఫెస్టోల్లో ఉంటుదా? జనాభా అంటే ఓట్లు రాజకీయం. రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలన్నింటికీ ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధించినది జనాభా పెరుగుదల.

జనాభా పెరిగి రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్ మీద దృష్టిపెట్టిన కారణంగా సమాజిక న్యాయాన్ని మరచిపోతున్నారు. ఆ కారణంగా అన్నిరకాల వృత్తులలో అసమతౌల్యము (Mis-match) ఏర్పడి ఉంది. రాజకీయ నాయకుడు, వ్యాపారిగా,

స్వామీజీగా, సినిమా యాక్టర్‌గా అవతారమెత్తుతున్నాడు. స్వామీజీ వ్యాపారం, రాజకీయం చేస్తున్నాడు. ఉపాధ్యాయుడు తన పని తప్ప మిగతావన్నీ చేస్తున్నాడు. గీతలో చెప్పిన స్వధర్మాన్ని అనగా గుణకర్మ విభాగాన్ని తుంగలోతొక్కి సమాజాన్ని నడిపిస్తున్నారు.

మరొక సమస్య అనర్హతాధికారం ( Misplacement ). కేవలం పార్టీకి సంబంధించిన వ్యక్తి కొరకు చట్టాన్ని న్యాయాన్ని తుంగలో తొక్కి పెద్ద పదవులను కట్టబెడుతూ అనర్హతను, నిర్వహణ అసామర్థ్యాన్ని పెంచిపోషిస్తున్నారు.

భారతదేశం ప్రపంచంలోని భూ విస్తీర్ణంలో ఏడవ స్థానంలో ఉంటూ జనాభా విషయంలో రెండవ స్థానంలో ఉంది. ఇది ఇలా ఉంటే రాజకీయ నాయకులు భారతదేశంలో యువత శాతం ఎక్కువగా ఉన్నదని విర్రవీగుతున్నారు. వీళ్ళు వృద్ధులయ్యే సరికి, రాబోయే తరాలు పడే అవస్థలను దృష్టిలో పెట్టుకునే దూరదృష్టి మరుగున పడిపోతున్నది. నిజానికి సమాజంలో సమస్యలన్నింటికి కారణం జనాభా పెరుగుదల. ప్రస్తుత సమస్యలకు నేటి రాజ్యాంగంలో, ప్రభుత్వం వద్ద జవాబులు లేవు.

1) జీవులకు వ్యవసాయానికి కావలసిన నీరు, విద్య, వైద్యం, ఆరోగ్యం ఆహారం, నైపుణ్యం, ప్రేరణ లేనిదానికి జవాబు లేదు.

2) ఆధ్యాత్మికతకు పెద్ద పీట వేసిన భారతదేశం, అన్ని రకాల మత్తు పదార్థాల వ్యాపారాలతో అలరింపబడుతున్నదానికి జవాబు లేదు.

3) మతాలు కులాలు అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య అసమానత్వాన్ని పెంచి పోషిస్తుందన్నదానికి జవాబు లేదు.

4) కష్టపడడం ఇష్టంలేకుండా ఇతరుల దగ్గర చేయి చాచే దౌర్భాగ్యానికి లోను కాని విశ్వాసాన్ని, వ్యక్తిత్వాన్ని కల్పించలేనందుకు జవాబు లేదు.

పిల్లల చదువు ఖర్చు, కులం ఆదాయం ప్రాతిపదిక మీద ప్రభుత్వం భరిస్తుంది. ఆకారణంగా అలాంటి చదువులు ఇష్టంలేని వారు, ఇష్టంగా చదవని వారు కూడా పెద్ద చదువులు చదివామనీ, అయినా ఉద్యోగాలు లేవని ఉద్యమాలు

చేయడానికీ, పెళ్ళికి ఎక్కువ కట్నం డిమాండ్ చేయడానికీ, నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోవడానికీ పనికి వస్తాయి. పెద్ద చదువులు చదివినా, పది వాక్యాలలో ఒక లీవు లెటరు రాసే సామర్థ్యం ఉండదు. ఆకారణంగా ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోతారు. నైపుణ్యం కొరకు ప్రభుత్వం మరలా స్టైఫండ్ ఇచ్చి ట్రైనింగ్ ఇస్తున్నారు. వాళ్ళ సామర్థ్యాల వెలితివల్ల ప్రైవేటు కంపెనీలు వీళ్ళకు ఉద్యోగాలు ఇవ్వరు. ఇది ఒక ప్యారడాక్స్.

అనేక పార్టీలు తాము ఆచరణలోకి తెచ్చేందుకు వీలులేని విషయాలను, ప్రమాణాలను ప్రస్తావిస్తారు. పేదప్రజలకు చేసే సహాయం పై తరగతి మధ్యతరగతి ప్రజలు టాక్స్ రూపంలో కట్టిన దాంట్లో నుంచి వచ్చినదే కదా! ఒక వర్గం దగ్గర టాక్స్‌లు వసూలు చేసి మరొక వర్గానికి రాయితీలు కల్పిస్తారు. కాని అనేక విషయాలలో, తత్వం తర్కం ఉండదు. కేవలం రొమాంటిక్‌గా ఉంటాయి. ఉదాహరణకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి కిలోబియ్యం ఒక రూపాయికు ఇస్తారు. కాని వాళ్ళు తాగే సారాయి మీద పదులు వందలలో టాక్స్ వసూలు చేస్తారు. వాళ్ళు తాహత్తుకు మించిన విధంగా సారాయి త్రాగి, వాళ్ళ ఆరోగ్యాన్ని ఉత్సాహాన్ని పనిచేసే నైపుణ్యాన్ని పనిచేయాలనే ప్రేరణను నాశనం చేసుకుంటున్నారు. త్రాగుడుకు బానిసై వాళ్ళ కిడ్నీ, లివరు, గుండె, మెదడు, నరాల బలహీనత, ఉదర వ్యాధులకు ఆరోగ్యశ్రీ లాంటి పథకాలతో అనవసరంగా ప్రభుత్వ ఖజానాకు చిల్లికొడతారు. ఆహారశ్రీని, సారాశ్రీతో సవరిస్తారు. ఇది మరొక ప్యారడాక్స్.

*

# 3. రాజకీయ చదరంగం

రాజకీయ నాయకుల చదరంగం  ఎలాగైనా అధికారాన్ని తద్వారా ధనాన్ని  చేజిక్కించుకోవడం, దేశాధ్యక్షుడు, ప్రధానమంత్రి, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల పార్లమెంటరీ సభ్యులు, అసెంబ్లీ సభ్యులు వాళ్ళ నుండి ఉద్భవించిన కాబినెట్ మంత్రులు అందరిని  కలిపితే కేవలం 7000 లలో ఉంటారు. చట్టాలను ఆచరణలో అమలులో పెట్టే అధికారులు ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. తదితరులు 5000 మంది ఉంటారు. న్యాయమూర్తులు 4000 వేల మంది ఉంటారు. వీళ్లు 130-140 కోట్ల జనాభా తలరాతలను వ్రాయడంలో బ్రహ్మదేవుని కన్నా మిన్నైనవారు. అయితే **పారడాక్స్** ఏమిటంటే, ఈ ప్రజాప్రతినిధులు ప్రజల విధిరాతలు వ్రాయ గలిగి ఉండి వాళ్ళు మాత్రం సమాజంలోని రౌడీల, గుండాల, స్వామిజీల మీద ఆధారపడి ఉన్నారు.

మరొక ప్యారడాక్స్, రాజకీయ నాయకులు ఒకవైపు అధికారాన్ని హస్తగతం చేసుకొని, మరొక వైపు స్వతంత్రత లేకుండా భయంతో బ్రతుకు సాగిస్తున్నారు. ఉదాహరణకు అధికార పార్టీనుండి ఒక్కొక్కసారి ఒక్క మెంబర్ గడబిడ చేసినా, ప్రభుత్వం కూలిపోతుంది. ఒక పార్టీ తక్కెడ  నుండి మరొక పార్టీ తక్కెడలోకి దూకుతారన్న భయం. ఎవరు తప్పు చేసినా అడగలేని పరిస్థితి, ఎవరికి కోపం వచ్చినా, ఓర్పు సహనం తెచ్చిపెట్టుకుని, భయం భయంగా ప్రధానమంత్రి  ముఖ్య మంత్రులు ప్రభుత్వాలను నడుపుతున్నారు. ఇంతకంటే అస్వతంత్రత మరొకటి ఉండదు. అనగా ఒక్కొక్కసారి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు కూడా ఆ ఒక్క మెంబర్ కంటె బలహీనులు. దీన్ని సరిదిద్ద లేకుంటే ప్రజలకు సమానాత్వాన్ని, స్వతంత్రతను, న్యాయాన్ని, రక్షణను ఎలా అందించగలరు?

రాజకీయంలో, అధికారపార్టీ ప్రతిపక్షపార్టీల మధ్య పంపకం ఉంటుంది. వాళ్ళ మధ్య ఒక అవగాహన ఉంటుంది. వాళ్ళు ఒకళ్ళకొకళ్లు ఇచ్చిపుంచుకుంటారు. రెండు వైపుల జరిగిన తప్పులను చూచిచూడనట్టు పోతుంటారు. పైకి తిట్టుకుంటారు. లోలోపల క్షమాపణ చెప్పుకుంటుంటారు. ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. ఎందుకంటే ఈ రోజు రూలింగ్ రేపు అపోజిషన్ కావచ్చు అవసరమైనప్పుడు అవకాశాన్ని బట్టి ఒక పార్టీలో నుండి మరొక పార్టీలోకి దూకుతారు. ఇది దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకునే విధంగా ఉంటుంది. ఈ సిస్టమ్‌లో అమాయకులు ఎవరయ్యా అంటే ప్రజలు, పార్టీ కార్యకర్తలు, రాజకీయ నాయకుల అనుచరులు.

## క్రమశిక్షణ కృతజ్ఞత

సమాజం యొక్క అభ్యున్నతికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృతజ్ఞత పట్టుకొమ్మ. క్రమశిక్షణ లేని కారణంగా ఈనాడు రాజకీయ నాయకులు ప్రజలకు కృతఘ్నులుగా మిగిలిపోతున్నారు. ప్రతివ్యక్తి కృతజ్ఞతా పూర్వకంగా తిరిగి ఇచ్చిననాడే "మనీషి" అంటే మానవత్వం ఉండేవాడు అవుతాడు, తీసుకోవడం మాత్రమే తెలిసి, తిరిగి ఈయనివాడు వ్యక్తిత్వం లేనివాడు. చివరకు చెట్టుపుట్ట, జంతువులు పక్షులు, చేపలు నిరంతరం చేస్తున్న త్యాగం మూలంగా, మానవులకు ఆహారంగా మారుతున్నాయి. ఇలాంటి బుద్ధిని మానవుడు పుణికిపుచ్చుకోకపోతే మానవుడు బ్రతికి ఉండికూడా చచ్చిన వాడితో సమానం అవుతాడు. అనగా కృతజ్ఞత లేక కృతఘ్నుడవుతాడు. వ్యక్తుల సప్తవ్యసనములకు, హత్య, దోపిడి ఆత్మహత్యలాంటి పాపాల నివృత్తి కొరకు ప్రాయశ్చిత్తం ఉంది. కాని కృతఘ్నతకు ప్రాయశ్చిత్తం లేదు. కృతజ్ఞతతో కర్తవ్యాన్ని నిర్వర్తించే రాజకీయ నాయకులు విసర్జించవలసిన కర్తవ్యాలు: దురాశ, స్వార్థం, అసూయ, అహంకారం, కోపం, గర్వం, దంభం.

అందుకే శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో
"యద్య దాచరతి శ్రేష్ఠ తత్తదేవేతర జనః ।
సయత్ ప్రమాణం కురుతే లోక స్థదనువర్తతే ॥"

(నాయకులు ఎలా ఆచరిస్తే ప్రజలు కూడ వారిని అనుసరిస్తారు– "యథా రాజా తథా ప్రజః").

ముఖ్యంగా రాజకీయ నాయకులు శారీరక సౌఖ్యాన్ని, సుఖాన్ని, తృప్తిని కలిగించే భౌతిక అష్టలక్ష్ములను ప్రోగు చేసుకుంటూ మానసిక కాలుష్యంతో బాహ్యాంతర వాతావరణ కాలుష్యానికి దోహద పడుతున్నారు. కాని, మానసిక అష్టలక్ష్ములైన నీతి, న్యాయం, ధర్మం, శాంతి, సహనం, త్యాగం, వినయం, ప్రేమ లను తిరస్కార భావంతో చూడటం వలన మానవులు కృతఘ్నులుగా నిలిచి పోతున్నారు.

## సమానత్వం

అసలు సమానత్వం, Equality ఈక్వాలిటి అనగా ఏమి? సమ భాగమా? అయితే అది న్యాయంకాదు. సృష్టిలో ఏ జీవులు సమానంగా ఉండరు. మానవులు అసలు సమానంగా ఉండరు. శారీరకంగా మానసికంగా, అన్నింటిలో తేడా కనబడుతుంది. ఏ ఇద్దరు వ్యక్తులు, చివరకు ట్విన్స్, సయామి ట్విన్స్ కవలలు, జంట కవలలో కూడా అది వీలుకాదు. ఆర్థిక సామాజిక రాజకీయ ఆధ్యాత్మిక వ్యవస్థలలో సమానత్వం వీలుకాదు. అవకాశాలను ఫలాలను సమానంగా పంచడం కుదరదు. సమానత్వం సమాంతరమా, లేక పైనుండి క్రిందకు, క్రింద నుండి పైకా? ప్రజాస్వామ్యంలో సమానంగా ఉండేది ఓటు ఒక్కటే. పరిశీలిస్తే కులంతో, మతంతో, అధికారంతో ఆర్థిక స్థోమతతో, నైపుణ్యంతో జత పరచకుండా ఓటు అందరి విషయంలో సమానమైంది.

రాజ్యాంగంలో సమానత్వం అనగా, ఇతరుల నుండి పొందిన ఫలితానికి సమానమైన పరిహారం ఇవ్వడం, ఏ తప్పుకైనా పాపానికైనా ప్రాయశ్చిత్తం. దీనిని అర్థం చేసుకుంటే రాజ్యాంగంలోని సమన్యాయం, సోదారాభిమానం, స్వతంత్రత అర్థమౌతాయి. అందరు సుఖంగా సంతోషంగా ఆనందంగా "ఇదిగోనమ్మ పుల్లకూర అంటే, ఇదోగోనమ్మ తియ్యకూర. ఇదిగోనమ్మ గొడ్డుకు నున్న అంటే ఇదిగోనమ్మ బిడ్డకు వెన్న" అని ఇచ్చిపుచ్చుకుంటారు.

సమన్యాయం అర్థంకావడానికి, శిబిచక్రవర్తి డేగకు పావురానికి న్యాయం చేయాలనే ధర్మదీక్షతో తనకు తాను అర్పించుకునేందుకు ఉద్యుక్తుడయినాడు. అంటే సమన్యాయానికి ప్రతివాడు కొంత త్యాగాన్ని విధిగా అనుసరించాలి. ముఖ్యంగా రాజకీయ నాయకులు అధికారాన్ని అనుభవిస్తారు. కాబట్టి దానికి సరిసమానమైన త్యాగాన్ని ఆచరణలోకి తెచ్చుకోవాలి.

దీనికి గాంధీ వచించిన నాయకత్వపు ఆలోచనలను ఆచరణలను దృష్టిలో ఉంచుకుంటే లోకసంగ్రహ తత్వము అర్థమవుతుంది. గాంధీ ఆలోచనా విధానం ప్రతి నాయకుడు లోకసంగ్రహ తత్వానికి ప్రతినిధి కావాలి.

నాయకుడు తన ఆనందం కోసం, అధికారం కోసం, సంపద కోసం వెంపర్లాడకుండా నిరంతరం భగవంతుని ఉనికిని స్పృహలో ఉంచుకోవాలి. అనగా లోకసంగ్రహానికి సంసిద్ధుడైన నాయకుడు అహింసను అనుసరించాలి.

గాంధీ దృక్పథంలో హింస అంటే, భౌతికంగా ఇతరులను హింసించడం మాత్రమే కాదు. చెడ్డ ఆలోచన, అసహనం, అసూయ, అనృతం కూడా హింస జాబితాలో చేరుతాయి. ఇతరులకు చెడు జరగాలన్న అభిలాష, ఇతరులకు అవసరమైన సంపదను తన అధీనంలో ఉంచుకోవాలని అనుకోవడం కూడా 'హింస' లోకి వస్తాయి.

*

# 4. ప్రస్తుత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు విధులు

**భా**రత రాజ్యాంగం ప్రపంచంలో కెల్లా అత్యంత శ్రేష్ఠమైన ఉత్తమమైన రాజ్యాంగంగా అభివర్ణించబడింది. ఈ రాజ్యాంగ స్వభావం ప్రకరణలు (465), భాగాలు (25), షెడ్యూలు (12) రూపాలు ఉన్నాయి. అయితే క్రొత్తగా 92 ప్రకరణలను చేర్చి 22 ప్రకరణలు తొలగించబడ్డాయి. భారత రాజ్యాంగంలో మూడవ భాగంలో 12 నుండి 35 వరకు గల ప్రకరణలో ప్రాథమిక హక్కులు పొందుపరచబడ్డాయి. ప్రస్తుతం ఆస్తి హక్కు పోగా 6 ప్రాథమిక హక్కులు ఉన్నాయి. అవి సమానత్వ హక్కు, స్వాతంత్ర్య హక్కు, దోపిడిని నిరోధించే హక్కు, మతస్వాతంత్ర్య హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు, రాజ్యాంగ పరిరక్షణ హక్కు.

రాజ్యాంగ ప్రవేశిక పాఠ్యాంశం, "భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగాన్ని నిర్మించు కునేందుకు పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచనా, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యయాన్నీ., అంతస్థుల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి, వారందరిలో వ్యక్తి గౌరవాన్నీ, జాతీయ సమైక్యతనూ, సమగ్రతను సంరక్షిస్తూ సౌభ్రాత్రుత్వాన్ని పెంపొందించడానికి, ఈ 1949 నవంబరు 26వ తేదీన మా రాజ్యాంగ పరిషత్తులో ఆమోదించి, శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించు కుంటున్నాం.

సార్వభౌమత్వం - Sovereignty.

సామ్యవాదం - Socialist.

లౌకికతత్వం - Secular

ప్రజాస్వామ్యం – Democracy

గణతంత్ర - Republic

సమాజంలో పౌరులందరికీ జాతి మత కుల లింగ పుట్టుక భేదాలు లేకుండా న్యాయం (Justice), స్వేచ్ఛ (Liberty ), సమానత్వం (Equality), సౌభ్రాతృత్వం (Fraternity), ఐక్యత & సమగ్రత ( Unity & Integrity ), మౌళిక రాజ్యాంగంలో ప్రాథమిక హక్కు ప్రస్తావన లేకున్నా 1976లో 42వ సవరణ ద్వారా 4ఏ భాగంలోని 51ఏ అధికరణలో 10 విధులను పొందుపరిచారు. ఆ తరువాత 86వ సవరణ (2002) ద్వారా మరొక ప్రాథమిక విధిని చేర్చి వీటి సంఖ్యను 11కు పెంచారు.

రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులు అన్నీ అందరి ప్రజలకు అందుబాటులో ఉన్నాయా? రెండవది ప్రస్తుతం పొందుపరచబడిన ప్రాథమిక హక్కులకు జతచేయవలసిన ఇతర హక్కులు ఏమైనా ఉన్నాయా? రాజ్యాంగం ప్రవేశపెట్టి 70 సంవత్సరములైనా అసమానత్వం, అన్యాయం, అస్వతంత్రత ఉండడానికి కారాణాలేమిటి! సమస్యలేమిటి! సమాధానాలు వెతికేందుకు ఎన్ని ప్రయత్నాలు జరిగాయి? ఆ ప్రయత్నాల ఫలితాలేమిటి? ఆ ఫలితాలను ఆచరణలోనికి తేవడానికి ఎంత కృషి జరిగింది? వీటిని ఎదుర్కొన్న అడ్డంకులు ఏమిటి? వాటిని అధిగమించేందుకు జరిగిన ప్రయత్నాలేమిటి?

ఒక పార్టీ తనతో పోటీపడిన మరొక పార్టీని, సభ్యసమాజంలో వాడగూడని భాషతో వాళ్ల దుర్మార్గాన్ని, స్వార్థాన్ని, అవినీతిని ఎండగట్టి 24 గంటలు గడవక ముందే ఆ పార్టీతో చేతులు కలిపి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్న అసభ్యకర చర్యలను ప్రజలు హర్షిస్తున్నారని అనుకోవడం, కళ్ళుమూసుకొని పాలుతాగే పిల్లి తనను ఎవ్వరూ చూడడం లేదని అనుకోవడమే.

నేటి రాష్ట్ర ఎమ్మెల్యేలకు, కేంద్ర ఎం.పీ. లకు 20 ఆబ్జక్టివ్ ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రాజ్యాంగంలోని విషయాలపై పరీక్షలు నిర్వహిస్తే బహుశా 40 శాతం మార్కులతో 20 శాతం కంటే ఎక్కువ మంది ఉత్తీర్ణులు కారు అని అనిపిస్తుంది.

# 5. నూతన రాజ్యాంగ విధానాలు

ప్రతిజీవి పుట్టినప్పుడు స్వతంత్రతతో జీవితాన్ని ప్రారంభిస్తాడు. వ్యక్తి ఎదుగుదల ప్రారంభమైన నాటి నుండి, తనకుతానే బంగారు సంకెళ్ళు వేసుకొని, తన సంకెళ్ళను తానే కౌగిలించుకుని ముద్దు పెట్టుకుంటాడు. ఇది ఇంద్రియాలు చేసే గారడి. మానవుడు ఆటవిక ప్రవృత్తి నుండి తన మేధస్సును వికసింపచేసుకుని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని, వ్యక్తులను వర్గాలుగా, వర్ణాలుగా విభజించుకొని, సమాజాలుగా తీర్చిదిద్దుకుని, ఆనాటి స్థితిగతులకు అనుగుణంగా, స్మృతులను చట్టాలను పొందుపరచుకుని, అనేక ప్రయోగాలను చేసి, బానిసత్వం నుండి రాచరికం సర్ఫ్‌డామ్ ద్వారా జమీందారీ వ్యవస్థను దాటి డెమొక్రసీ సోషలిజం స్థితికి చేరుకోవడం ఒక మహాప్రస్థానం.

దేశంలో అన్ని మతాలకు, కులాలకు, వర్గాలకు, లింగభేదం లేకుండా ఒకే చట్టం అమలులో ఉంటే నేరము శిక్ష, ధనికులకు రాజకీయ నాయకులకు అధికారులకు ఒకరకంగా, సామాన్య ప్రజలకు మరొక రంకంగా ఉండదు. అది సమన్యాయం.

ప్రస్తుతం భారత దేశంలోని ప్రజాస్వామ్య ఆధ్యాత్మిక రాజకీయ సమస్యకు సమాధానం ఏమిటి! అన్న ఆలోచన అనేకమందిని పీడిస్తున్నది. దాదాపు 70 సంవత్సరముల క్రిందట కంప్యూటర్ టెక్నాలజీ లేనప్పుడు, శాటిలైట్ లేనప్పుడు ఇతర గ్రహాలమీద కాలుమోపి దూరాన్ని, కాలాన్ని కుదించలేనప్పుడు రచించిన రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన లేని రాజకీయ పార్టీల నిబద్ధతను స్వార్థం క్రింద, అక్రమం క్రింద జమకట్టాల్సిందేకదా!

నేటి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, సమస్యలు సమాధానాలు సాధన క్రమం కల్గి భారతదేశపు కుటుంబవ్యవస్థను భిన్నత్వంలో ఏకత్వాన్ని అర్థం చేసుకుని, ప్రజాస్వామ్యానికి దశ దిశ చూపించే ప్రత్యామ్న్యాయ రాజ్యాంగం కావాలి. రాజ్యాంగం అధికార తీర్థాన్ని ప్రసాదాన్ని అందరికీ సమన్యాయంతో పంచగలిగితే, దూషణలు తిరస్కారాలు చాలా వరకు తగ్గే అవకాశం ఉంది. దీనికి అధికార పార్టీ 'అవును' కు 'కాదు' అనడానికి వీలుకాని ప్రతిపక్షంతో కూడిన రాజ్యాంగ విధానం కావాలి.

గాంధీజీ అంబేద్కరు ఈనాడు బ్రతికి ఉంటే బహుశా ఇలాంటి ఆలోచనలే ప్రతిపాదించి ఉండెవారేమో అని అనిపిస్తున్నది. కావున ప్రత్యక్ష పరోక్ష ఎన్నికల మిశ్రమంతో కూడిన రాజ్యాంగ విధివిధానాలను తయారుచేసుకొని అనుసరించడం అటు ప్రజలకు, ప్రభుత్వాలకు రాజకీయ నాయకులకు అధికారులకు సమన్యాయం కలిగిస్తుంది. దీని అర్థం "తిలా పాపం తలా పిడికెడు" అన్న సూత్రంతో, అనేకమంది కోపాగ్ని కనీసం చల్లబడుతుందేమో అని ఆశ. అది కాక దీనిలో మరొక నగ్న సత్యం ఉంది. అందరినీ సమానంగా చూచినప్పుడు కొన్ని పార్టీలు అధికారం చేజిక్కించలేనప్పుడు, ప్రజలను తమ సిద్ధాంతాలతో నమ్మించలేనప్పుడు, సహజంగా దేశంలోని నివురుగప్పిన నిప్పునుంచి వేదాంతం బయటకు వచ్చే అవకాశం ఉంటుంది. అనగా మనకు 'అదృష్టం' లేదు. ఇది మన 'కర్మ' అనుకొని వేరే చిన్న చిన్న పార్టీలు, వ్యాపార రంగాల్లో చిన్న చిన్న కంపెనీలు కలిసి పెద్ద కంపెనీలు అయిన చందాన, పెద్ద పార్టీలుగా తమ అజెండాతో ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. వ్యాపార వ్యవస్థలలో వీటిని కాంబినేషన్స్ అంటారు. తద్వార దేశంలోని పార్టీల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

హిందూదేశంలో 80 శాతం మంది హిందువులు ఉంటే, ఈ దేశానికి మొదటి అంకం అంగం ఆధారం ధార్మికత. అనగా వేదాల ఉపనిషత్తుల పురాణాల తర్కం తత్వం, మరే దేశంలోని మత గ్రంథాలలోనూ లేదు. అలాంటిది దాని సారాంశాన్ని ప్రతి పౌరునికి అందించవలసిన బాధ్యత లేదా? అలాంటిది ధార్మికతను

ఫండమెంటల్ రైట్స్‌గా (ప్రాథమిక హక్కుగా) చేర్చవలసిన అవసరం ఉన్నదా? అలాంటి హక్కులను సెక్యూలరిజం పేర నిర్లక్ష్యం చేయడం అన్యాయం కాదా? సెక్యూలరిజం అనగా ద్వేష రహితమైన సిద్ధాంతాన్ని నమ్మికతో ఆచరించడం.

విషయ వైశాల్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లుప్తంగా కొన్ని మార్పులను, చేర్పులను క్రింద పొందుపరచబడ్డాయి.

## రాజ్యాంగం కర్తవ్యాలు :

1) ఈనాటి సమాజానికి అవసరమైన హక్కులు విధులు బాధ్యతలను సమకూర్చి, రాజకీయ పార్టీల కులాల స్త్రీ పురుషుల వృత్తుల మధ్య దామాషా ప్రకారం విధులను, తద్వారా హక్కులను విభజించి, వ్యక్తుల ప్రేరణకు, వ్యక్తిత్వానికి పెద్ద పీటవేసి తమ తమ శక్తియుక్తులను తమకు సమాజానికి ఉపయోగపడే వాతావరణాన్ని సృష్టించి, ప్రజాసంక్షేమానికి కావాల్సిన వసతులు వనరులను సమకూర్చగల, 2) క్రమశిక్షణతో కూడిన పౌరస్వాతంత్ర్యం కలుగ జేయగల, 3) సమానత్వంతో కూడిన న్యాయాన్ని అందించగల, 4) విలువలతో కూడిన విద్యా విధానాన్ని సమకూర్చగల, 5) ఇతరుల మీద ఆధారపడని సంపాదనను అందుబాటులోకి తేగల, 6) అసమానత లేని జీవనభృతిని కల్పించగల, 7) ప్రాణ, మాన, ఆరోగ్య, శత్రు, రక్షణతో కూడిన వ్యవస్థను తీర్చిదిద్దగల, 8) సర్వజనుల అభివృద్ధికి పునాదులు వేయగల, 9) విధులను నిర్వర్తించేందుకు అడ్డుగోడలు లేని చట్టాలలకు వెసులుబాటు కల్పించగల, 10) అవినీతిని నిర్మూలన చేయగల, 11) ఆకలి, అనారోగ్యం లేని స్థితిగతులను కల్పించగల, 12. మత్తు పదార్థాలు తయారు చేసే పంటలను అదుపులోకి తెచ్చి వాటి వ్యాపారాలను నిరోధించగల, 13. జనాభాను నియంత్రించ గల, 14. సమానమైన హక్కులు విధులతో అందరికీ ఒకే చట్టాన్ని అమలు చేయగల, 15) వందేమాతరాన్ని అర్థం చేసుకొనే సమాజాన్ని నిర్మాణం చేయగల, 16) నాయకుడు ఒకడే అన్న హీరో వర్‌షిప్ / వ్యక్తిపూజ అపోహ నుండి బయటపడ వేసి, అన్ని స్థాయిలలో ప్రజలను నడిపించే నీతివంతమైన నాయకుల సమూహాన్ని (ఇంజన్) తయారు చేయగల రాజ్యాంగ విధానం కావాలి.

1. సమత్వ, స్వతంత్ర, సమన్యాయ, రాజ్యాంగం కొరకు, ఎ) పంచాయితీ అధ్యక్షుడు, బి) ముఖ్యమంత్రి, సి) ప్రధానమంత్రి, డి) దేశాధ్యక్షుడు ప్రత్యక్ష ఎన్నికల్లో ఎన్నుకోబడాలి. మిగతాదంతా ప్రస్తుత పద్ధతుల్లోనే అనుసరించవచ్చు.

2. ప్రెసిడెంట్, పి.ఎం., సి.ఎం., పంచాయితీ ప్రెసిడెంటు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోబడుతున్నందున వాళ్ళు ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండనక్కరలేదు. కాని వాళ్ళు తమ పరిధిలో దేశానికి, రాష్ట్రానికి, గ్రామానికి దక్షత వహించి అన్ని కార్యక్రమాల విషయాలను ఎలక్షన్స్‌కు ముందే గతంలోని ప్రభుత్వ వ్యవస్థల అధికార విధివిధానాలను అనుసరిస్తూ, మరుసటి సంవత్సరం ప్రారంభంలో పరిస్థితుల ప్రభావాలకు అనుగుణంగా అవసరమైన మార్పులను చేసుకుంటూ 5 సంవత్సరాల కాలం ప్రభుత్వాన్ని నడుపుకోవచ్చు. రాజ్యాంగం చట్టాలు, ప్రభుత్వ లక్ష్యాలు, పాలసీలు, అజెండాలు, ప్రోగ్రాములు, జీరో బడ్జెట్లు , ప్రియారిటీసు, ముందుగానే ఫిక్స్ అయ్యి ఉంటాయి. కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లోలాగ రాజకీయ నాయకులు ప్రభుత్వాధికారులు, తమ ఇష్టానుసారంగా తీర్మానాలను చేసుకోవడానికి వీలు ఉండదు.

3. ప్రెసిడెంట్, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, పంచాయితీ ప్రెసిడెంట్ తమ పదవుల పోటికి నామినేషన్లు వేసి గెలిచినప్పుడు, తమ తమ పార్టీలకు రాజీనామాలు సమర్పించిన కారణంగా, వారు అటు పార్టీని ఇటు పార్లమెంటు మెంబర్లను అసెంబ్లీ సభ్యులను చూచి భయపడవలసిన అవసరం లేదు.

4. ప్రెసిడెంటు, పి. ఎం., సి. ఎం. బాధ్యతతో కూడిన స్వతంత్ర్యం ఉన్నందున, తన కేబినెట్‌ను చట్టబద్ధంగా నడిపే స్వాతంత్ర్యం ఉంటుంది. ఓటరులలో ప్రజలలో ఒక క్రొత్త చైతన్యం వస్తుంది. ఏ పార్టీ మంత్రి చక్కగా ప్రణాళికలను ఆచరణలో పెట్టగలిగితే, ఆ మంత్రికి తన పార్టీకి మంచిపేరు వస్తుంది. ఆ కారణంగా తదుపరి ఎలక్షన్లలలో ఎక్కువ సీట్లు, దామాష మంత్రులు, పెరిగే అవకాశం ఉంటుంది. అందుకని అందరూ కష్టపడి పనిచేస్తారు.

5. క్యాబినేట్‌కు ఎన్నుకునే మంత్రులు కేవలం వాళ్ళ వాళ్ళ అర్హతులను పట్టి తప్ప, వాళ్ళ పార్టీ పరిమాణము, సభ్యుల మెజారిటీ, పార్టీ మైనారిటీ లాంటి వ్యవహారాలకు తావులేదు. ఉదాహరణకు ఫైనాన్స్ మినిష్టరుగా సెలక్ట్ చేసే తీర్మానానికి తీసుకోవాల్సిన అర్హతలు : అతను చార్టర్డు అకౌంటెంట్, సి.ఏ. డిగ్రీ ఉందా, కొంతకాలం ప్రాక్టీసు చేసి పెద్ద కంపెనీలకు కన్సల్‌టెంట్‌గా ఉన్నాడా, గ్రంథాలు రాసిన కీర్తి ప్రతిష్టలు ఉన్నాయా?

ఇలాంటి విషయాలను పరిగణనలోకి తీసుకుని అతను 10 మంది సభ్యులతో కూడిన పార్టీలోని వ్యక్తి అయివున్నా మంత్రి పదవికి అర్హత ఉన్నవాడు కాబట్టి, 200 మంది సభ్యులుండి, 20 మంది మంత్రి పదవులకు అర్హత ఉన్నవాళ్ళను తోసిరాజని అతనికి ఆ పదవిని ఇయ్యవలసి వస్తుంది. ఒకమాటలో చెప్పాలంటే పెద్ద కంపెనీలో చైర్మెన్ నుండి చెప్రాసి దాక ప్రమోషన్ డిమెషన్‌ను హెచ్.ఆర్. పాలసీలతో నడిచే విధంగా ప్రభుత్వాన్ని కూడా నడపాలి. రాజకీయం కూడ వృత్తిధర్మం ప్రొఫెషనల్స్ ఎతిక్స్ పాటించాలి.

6. ఇదే విధంగా రిజర్వేషన్ విషయంలో కూడా అందరికీ సమన్యాయం కలిగే సిద్ధాంతాన్ని ఆచరణలోకి తేవడం అత్యవసరం. రిజర్వేషన్ అన్ని వర్గాలకు, కులాలకు, మతాలకు వాళ్ళ దామాషాలో పంచితే ఇంతకంటే మెరుగైన సమాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని తయారుచేసుకోగలం.

7. పార్లమెంటు సభ్యులు అసెంబ్లీ సభ్యులు, వాళ్ళ వాళ్ళ పార్టీల నుండి వాళ్లు పోటీకి నిలుచున్న నియోజక వర్గాలనుండి ఎన్నుకోబడతారు. అలా ఎన్నుకోబడిన వారికి సమానత్వం కొరకు న్యాయం కొరకు ప్రజల రక్షణ కొరకు స్వతంత్రత కొరకు, ఎవరి భాగం రొట్టె వాళ్ళకు ఇస్తే రొట్టెల పండుగ జరుపుకోవచ్చు.

ఉదాహరణకు పార్లమెంట్‌లోని లోక్‌సభలో జనాభా పెరిగిన దృష్ట్యా 600 సీట్లు ఉన్నాయనుకుందాం. వాటిని పార్టీలో గెలిచిన సభ్యుల దామాషాలో లేదా నిష్పత్తిలో అధికారాన్ని పంచుకోవాలి.

### క్యాబినెట్ అధికార విభజన

| | ఫార్టీలు | సీట్లు | మంత్రులు |
|---|---|---|---|
| 1. | పార్టీ | 200 | 20 |
| 2. | పార్టీ | 150 | 15 |
| 3. | పార్టీ | 60 | 6 |
| 4. | పార్టీ | 50 | 5 |
| 5. | పార్టీ | 40 | 4 |
| 6. | పార్టీ | 30 | 3 |
| 7. | పార్టీ | 20 | 2 |
| 8. | పార్టీ | 50 | 5 |
| | | 600 | 60 |

600 మెంబర్లకు 10 శాతం మంత్రివర్గం, అనగా 60 మంది మంత్రులతో క్యాబినెట్. అది సంకీర్ణం కదా! అని అనవచ్చు. చాలాసార్లు కేంద్రాల్లో రాష్ట్రాల్లో జరుగుతున్నది సంకీర్ణమే కదా! పైగా ఎలక్షన్ జరిగినంతకాలం కొట్టుకుని, తిట్టుకుని, అస్యహించుకుని, అబద్దాలు చెప్పుకుని, ప్రజలను మభ్యపెట్టి ఓటర్లకు ధనాన్ని సారాయిని విచ్చలవిడిగా పంచి, నిత్యావసరాలను, వస్తుసేవలను ఎరచూపి చివరకు సంకీర్ణం వైపు మొగ్గు చూపడం అసభ్యత కదా! పార్టీలో గెలిచిన సభ్యుల దామాషాలో అధికారాన్ని పంచుకుంటే, కనీసం 75 శాతం తమ సంస్కారాన్ని ప్రదర్శించిన వారౌతారు. దీని వలన వ్యక్తి క్యారెక్టర్, పార్టీ సిద్ధాంతాలను పరిగణలోనికి తీసుకొనిరావడానికి వీలవుతుంది. లోకసభలాగే అసెంబ్లీకి కూడా ఒకేపద్ధతి అమలులోకి వస్తుంది.

ఇలాంటి రాజ్యాంగ వ్యవస్థ వలన నాయకత్వ సంపద పెరుగుతుంది. అనగా అనేక స్థాయిల్లో మంచి నాయకులు తయారవుతారు. నాయకుడంటే దేశంలో ఒకే ఒక వ్యక్తి అనే అనుకోకుండా అది ఒక వర్గం, అది ఒక ఇంజను అని ఋజువు కాబడుతుంది.

ప్రతిపార్టీ తాము నిలబెట్టే సభ్యుల వయస్సు, విద్యార్హత, సేవాతత్పరత, జ్ఞానం, నైపుణ్యం, దృక్పథం లాంటి గుణగణాలను బేరీజు వేసికొని పార్టీల తరపున పోటీకి నామినేట్ చేస్తారు. పోటీలో గెలిచిన తరువాత మంత్రి కావాలంటే దానికనుగుణమైన అర్హతలను కూడా దృష్టిలో ఉంచుకోవడానికి అవసరం ఏర్పడుతుంది. అనగా ప్రస్తుత ధనం, కులం, మతం వర్గం మీద ఎన్నికలకు నిలబెట్టే వ్యక్తుల ఎంపికకు చాలావరకు చరమగీతం పాడడానికి వీలవుతుంది.

8. ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలోని గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం వలన రాజకీయ సామాజిక విషయాలపై తీర్మానాలకు అడ్డంకులు తొలిగే అవకాశం ఉంటుంది.

9. ఆనాడు సర్దార్ వల్లభబాయి పటేల్ ప్రవేశపెట్టిన సివిల్ సర్వీస్ సెలక్షన్ విధానాలకు పెనుమార్పులు తీసుకరావాల్సిన ఆవశ్యకత ఉన్నది. 25 సంవత్సరాల వయసులో ఉన్న వ్యక్తుల జ్ఞానశక్తిని దృక్పథాన్ని, వ్యక్తిత్వాన్ని అనుసరించి ఐ.ఏ.ఎస్‌కు, ఐ.పి.ఎస్ పదవులకు ఎన్నుకోవడం సముచితం కాదనిపిస్తుంది. ఒకవ్యక్తి తన నిజస్వరూపం బయటపడడానికి నలభై సంవత్సరాలు నిండితేనే వీలవుతుంది. కాబట్టి రాష్ట్రస్థాయిలో, కేంద్ర స్థాయిలో ప్రథమంగా గ్రూప్-1 ఆఫీసర్లను ఎన్నుకొని వారి సర్వీసు 10 - 15 సంవత్సరాలు జరిగిన తర్వాత వారి విజ్ఞతను ప్రవర్తను పరిణితిని దృష్టిలో పెట్టుకొని ఐ.ఏ.ఎస్.కు, ఐ.పి.ఎస్.కు అర్హతను కల్పించాలి. కావాలంటే ప్రత్యక్ష ఐ.ఏ.ఎస్‌లకు, గ్రూపు-1 సర్వీసుల మధ్య 25 : 75 శాతంలో అర్హతలను కల్పించవచ్చు.

10. ఎలక్షన్‌లో నిలబడి గెలిచిన మొత్తం ఎం.పీ.లు, రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు అందరికీ కనీసం 2 - 3 నెలల వ్యవధిలో అన్నిరంగాల్లో నిష్ణాతులైన మేధావుల ద్వారా శిక్షణ కార్యక్రమాలు జరపడం అవసరం. శిక్షణ ద్వారా సభ్యులకు దేశకాల పరిస్థితులను స్థితిగతులను, భారతదేశ చరిత్ర సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, నీతి ధర్మం న్యాయాల ఆవశ్యకతను, మానవ జీవిత పరిణామ క్రమాన్ని, భవిష్యత్ కార్యాచరణను రాజ్యాంగ విధి విధానాలు చట్టాలలోని లోతుపాతులను గురించి అవగాహన కల్పించడం వలన రాజ్యాంగంలోని తర్కాన్ని

తత్వాన్ని ఆకళింపుచేసుకోవడానికి అవకాశం కలిగి మంచి ప్రభుత్వాన్ని అందించగలుగుతారు.

11. ప్రతివ్యక్తికీ ఓనమాలు దిద్దించిన నాటినుండి తన బాధ్యతలకు కట్టుబడే విధంగా తీర్చిదిద్దడం ప్రథమకర్తవ్యం కావాలి. రాజ్యాంగంలో పౌర హక్కులు, విధులు ప్రాథమిక విద్య నుంచి విద్యార్థులకు ప్రత్యేక సిలబస్ ద్వారా అన్నిస్థాయిలలో అందించాలి.

*

# 6. పబ్లిక్ మేనేజ్‌మెంట్

సర్వసాధారణంగా అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరినొకరు ఇరుకున పెట్టడానికి, రాజ్యాంగాన్ని చట్టాలను ఆధారం చేసుకుంటున్నాయి. మెనేజ్‌మెంట్ సూత్రాలను అనుసరించి, సంకీర్ణ ప్రభుత్వాలను రాజ్యాంగపరంగా చట్టబద్ధంచేస్తే, ఎవరూ ఎవరి మీదా దుమ్మెత్తి పోసే అవకాశం ఉండదు. పైగా ఒకరు చేసే పనిని మరొకరు చెడగొట్టడం అనేదానికి అవకాశం ఉండదు. తద్వారా ప్రజల సంక్షేమాన్ని భద్రపరచి, భారతీయ సంస్కృతిని నిలబెట్టేందుకు మార్గం సుగమం అవుతుంది. గతంలో అశోకచక్రవర్తి ఏలుబడి క్రింద అనేక రాజ్యాలు పరిపాలించు కున్న రీతిలో సంపూర్ణ స్వేచ్ఛ, స్వతంత్ర ప్రతిపత్తికలిగి సమన్యాయంతో రాజ్యాలను ఏలుబడి చేయడానికి ఇబ్బంది లేదు కదా. అనగా ప్రజలతో కూడిన ప్రజాస్వామ్య సోషలిజం : నా + నీ = మన దేశము, ప్రభుత్వము, రాజ్యాంగం అవుతుంది.

పొలిటికల్ సైన్సు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్ట్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వరకు నేర్పిస్తున్నారు. ఇదంతా అరువు తెచ్చుకున్న విద్య. నేటి సమాజ వ్యవస్థకు ఈ సబ్జెక్ట్ అర్థం అంతరార్థం సరిపోదు. నేడు కావాల్సినది న్యాయబద్ధమై స్వతంత్రతతో కూడి రక్షణ, కృతజ్ఞత, అకౌంటబిలిటీ ప్రతిబింబించే రాజ్యాంగ శాస్త్రం.

అందుచేత పొలిటికల్ సైన్స్ బదులు **పొలిటికల్ మేనేజ్‌మెంటు,** పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ బదులు **పబ్లిక్ మేనేజ్‌మెంట్** అనాలి.

గతంలోనే కాక నేడు కూడా జాతీయ రాబడిని లెక్కలోకి తీసుకుంటే ప్రపంచంలో పది ప్రథమ స్థానంలో ఉన్న అంతర్జాతీయ సంస్థల ఆదాయం భారతదేశపు జాతీయాదాన్ని మించిపోతున్నది. ప్రస్తుత భారత దేశ స్థూల జాతీయాదాయం 2017 లెక్కల ప్రకారం షుమారు 2500 బిలియన్ డాలర్లుగా

నమోదయితే కంపెనీల ఆదాయం 2900 బిలియన్ డాలర్లుగా నమోదవుతున్నది. ఆ కారణంగా దేశ రాజకీయ పరిపాలన అంతర్జాతీయ సంస్థల పద్ధతులను అనుసరిస్తే పోయేదేముంది.

గతంలోని ఒక విచిత్రమైన విషయం తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగు తుంది. 1962 లో అమెరికాలోని జనరల్ మోటార్స్ ఆదాయం 20.7 బిలియన్ (2070) డాలర్స్. డాలర్ విలువ 7.5 రూపాయలు అయితే మొత్తం 15525 కోట్లు, భారతదేశపు జాతీయ ఆదాయానికి సమానం. అలాగే ప్రపంచం లోని ప్రస్తుత ఎం.ఎన్.సి. కంపెనీల బ్రాంచీలు దాదాపు నూరు దేశాల్లో వ్యవహారాలు జరుపుతున్నాయి. అలాగే భారతదేశంలోని బడా కంపెనీలు టాటా, అంబాని, బిర్లాలు తమ వ్యాపారాలను, అనేక ఇతర దేశాలకు విస్తరింప చేసుకుంటున్నారు. ఈ కంపెనీలో పనిచేసే వ్యక్తులు అన్ని మతాలకూ, రాజకీయ పార్టీలకూ, కులాలకూ, వర్ణాలకూ, వర్గాలకూ, జాతులకూ చెందినవారై ఉన్నారు. అక్కడ అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన వ్యక్తులు ఉన్నా అది వారి వ్యక్తిగతమైన విషయమే కాని వ్యవస్థకు ఇబ్బంది ఉండదు.

పబ్లిక్ సర్వీస్ కమీషను ద్వారా, గుమాస్తా నుండి ఐ.పి.ఎస్., పోలీసు నుండి సైంటిస్ట్ వరకూ ఉద్యోగం సంపాదించాలంటే అనేక పరీక్షలు, భాషా జ్ఞానం, యాటిట్యూడు, జీకెతో సహా రకరకాల ఇంటర్వ్యూలలో నెగ్గితే తప్ప, ఉద్యోగాన్ని సంపాదించడం వీలుకాదు. అలాంటిది రాజకీయ నాయకులకు ఏ స్క్రీనింగ్ టెస్ట్ అవసరం లేకుండా, ధనం, జనం, బలం ఉండి పార్టీ నిలబెట్టిన అనామకుడు కూడా అధికారంలోకి వస్తున్నాడు కదా అని ఈనాడు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగాల సెలక్షన్‌కు కూడా అదే పద్ధతిని ఎందుకు అనుసరించ కూడదు అన్న వాదాన్ని తెరమీదకు తెస్తున్నారు. అంటే ఒకచోట ఒక న్యాయం, మరొకచోట మరో న్యాయం అన్యాయం కాదా?

దీనికి నైతికత ఉన్న ఏ సభ్యుడైనా, రాజకీయ నాయకుడైనా, ఎం.ఎల్.ఏ. అయినా, యం.పి. అయినా జవాబు చెప్పగలడా? అలాంటి వ్యవస్థలలో సమానత్వానికి బదులుగా అసమానత్వం, న్యాయానికి బదులు అన్యాయం

రాజ్యమేలుతాయి కదా! స్వాతంత్ర్యం దుర్వినియోగం అవుతున్నదనీ, నైతికత లోపిస్తున్నదనీ, విలువలకు తిలోదకాలు ఇస్తున్నారనీ ఒప్పుకోవాల్సిందే కదా!

అయితే ప్రస్తుత విధానంతో నూతన రాజ్యాంగ విధానానికి మార్పులు తేగలిగితే, ప్రస్తుత రుగ్మతలను నివారించే అవకాశం ఉంటుంది. ఈనాటి ఎం.ఎన్.సి. కంపెనీలన్నీ కేవలం మేనేజ్‌మెంట్ సైన్సులోని లక్ష్యాలకు, సిద్ధాంతాలకు, పద్ధతులకు, అనుగుణంగా నడుస్తున్నాయి. అలాంటిది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ చట్టాలద్వారా అమలు జరపడం వీలుకాదా?

ఈనాటి (ఎం.ఎన్.సి.) కంపెనీలు 100 దేశాలలో బ్రాంచీలు నడుపుతున్నాయి. దీనికి ఆధారం మేనేజ్‌మెంట్ సైన్స్ సూత్రాలు, సిద్ధాంతాలు, ప్రణాళికలు, పద్ధతులు, వ్యూహాలు చైతన్యవంతమైన నాయకత్వం. అలాంటి మేనేజ్‌మెంట్ సైన్స్‌తో ప్రపంచంలోని అనేక వ్యాపార సంస్థలు నడుపుతున్న విధానంలోనే ప్రభుత్వాలను కూడా అతి సులువుగా నడపడానికి వీలౌతుంది కదా? రక్షణ ఉన్నప్పుడు లింగభేదం లేదు. వృత్తి భేదం లేదు. సంపదల తేడా లేదు. కులాలకు, వర్ణాలకు, వర్గాలకు, మతాలకు అతీతంగ రాజకీయ వ్యక్తులకు లోబడకుండా, ఎవరి ఆలోచలనకు కట్టడికి లోనుకాకుండా, మనిషిని చూచి మనిషి భయపడకుండా, తాను ఎవరికీ ఇబ్బంది కలిగంచకుండా, తన వృత్తిలో తన కర్తవ్యాన్ని నిర్వర్తించి బ్రతుకు సాగించగలగడం రాజ్యాంగం యొక్క లక్షణం కావాలి.

## ప్రజా ఉద్యమాలు

ఈ దేశంలో స్త్రీల యెడల, నిరుద్యోగుల యెడల దీనుల యెడల, జాలిలేని రాజకీయ నాయకుల పార్టీలపై కక్షకట్టి, వాళ్ళు అధికారం చెలాయించే దోపిడీ వ్యవస్థపై, ప్రత్యక్షంగా తిరగబడలేక పరోక్షంగా తిరస్కరించాలనే క్రొత్త ఆలోచనా విధానాన్ని (కాన్సిస్ట్యూషన్‌ను) తయారు చేసుకుని తిరగబడ్డ ఉద్యమకారులే నక్సల్స్. అలాంటి వాళ్ళ కారణంగా, సమాజంలో అటు రాజకీయ నాయకుల ఆగడాలతో, ఇటు ఉగ్రవాదులు అతివాదులు చేసే అసాంఘిక కార్యక్రమాలతో అశాంతి పెచ్చు పెరిగి సాధారణ ప్రజల జీవనసమస్యలు

ముబ్బిడి అవుతున్నాయి. అయితే వీరిలో ప్రత్యక్షంగా పరోక్షంగా కొంతమంది శిక్షింపబడుతున్నారు. అలాంటి ఉద్యమకారుల శిక్షకు కారణం పట్టుబడడమే. సామెత చెప్పినట్టు, దొంగతనం చేసిన ఖైదీని శిక్షించడం, దొంగతనం చేసినందుకు కాదు, పట్టుపడ్డందుకు. పట్టుపడకపోతే దొంగకూడ దొర అవుతాడు. ఇది ఒక దేశానికి మాత్రమే పరిమితమైంది కాదు. ప్రపంచం యావత్తు అన్యాయం కోరల్లో చిక్కుకొని ఉగ్రవాద కార్యకలాపాలకు తెరతీస్తున్నది.

రాజకీయ నాయకుడు ఎప్పుడూ దొరే. నక్సలైట్లు దొరికినా దొరకకపోయినా నేరుస్తులుగా పరిగణింపబడుతున్నారు. వాళ్ళ ఆలోచన ఎలా ఉందంటే "జనజీవనంలో ఉండి అధికారం అందిపుచ్చుకున్న ధనికులకు ఊడిగం చేసేదాని కంటే అడవుల్లో స్వేచ్ఛగా తిరుగుతూ వాళ్ళకు నచ్చని వాళ్ళకు శిక్షలు విధిస్తూ, స్వతంత్రంగా జీవనం సాగించడం సుఖం. దీన్ని అర్థం చేసుకోవాలంటే, 'మిల్టన్' రాసిన 'పేరడైజ్ లాస్ట్' లోని వాక్యం సందర్భోచితంగా ఉంటుంది. "స్వర్గంలో సేవ చేసే దానికంటే, నరకాన్ని పరిపాలించడం శ్రేయస్కరం".

*

# 7. మ్యానిఫెస్టో

ఏ పార్టీకి అయినా లక్ష్యం ఒకటే. అది రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలన్నింటిలో అభివృద్ధిని సాధించడం, తద్వారా సమన్యాయాన్ని చేకూర్చడం. దీనికి శంకుస్థాపన జరగాలంటే సమానత్వం కావాలి. సమానత్వం లేకపోతే అభివృద్ధి లేదు. సమానత్వం అన్నది చిటికెడు గాలి లాంటిది. వ్యక్తి తీసుకున్న శ్వాస బయటికి రాకపోయినా, బయట నుండి గాలిలోనికి తీసుకోలేకపోయినా లేదా దానిలో అసమానతలు ఏర్పడినా హృదయ కవాటాలు సరిగా పనిచేయక, మెదడుకు ఆక్సిజన్ అందక, శరీరం చచ్చుబడే రీతిలో నిట్టనిలువుగా నిలబడవలసిన రాజ్యాంగం అడ్డంగా నేలకు కరుచుకుంటుంది.

అన్ని పార్టీ ఎలక్షన్ మ్యానిఫెస్టోలు సూక్ష్మంగా పరిశీలిస్తే ప్రజలకు కావాల్సిన విషయాలన్నీ ఒకే మూసలో భాషాబేధంతో కనపడుతాయి. 1–2 ప్రత్యేక విషయాలు మినహాయిస్తే దాదాపు అన్నీ ఒకటే. కోతులనన్నింటికీ మూతులు ఒకటే అన్న చందాన ఉంటాయి. కానీ వాటిని సాధించడం ఎండమావుల వెంట పరుగెత్తడమే.

స్వతంత్రత అంటే చట్టాన్ని న్యాయం కొరకు రక్షించడం. 'నేను' ను 'మనంగా' మలచుకొని, మ్యానిఫెస్టోలో పరిష్కరించే సమస్యలను, సంకల్పాలను సాధనా కార్యక్రమాలను పొందుపరచు కొని, కేవలం టి.వి.లలో మద్యం సీసాల మీద, సిగరెట్టు పెట్టెలమీద పొగత్రాగడం, మత్తు పదార్థాలు సేవించడం, మద్యపానం చేయడం హానికరం అని స్లోగన్స్ రాసి, పరిశ్రమలకు లైసెన్సులు ఇచ్చి ప్రజలను నిరంతరం మత్తులో ముంచే కార్యక్రమాలకు స్వస్తి చెప్పి, మద్యాన్ని పొగాకు ఉత్పత్తిని గుట్కా లాంటి మత్తుపదార్థాలను నిరోధించడానికి ఉక్కుపాదం మోపే సంకల్పాలను ఆచరణయోగ్యంగా చేయలేకపోవడమే.

**ఏ పార్టీ మ్యానిఫెస్టోలోనైనా, మచ్చుకకు నీతిగా ఉంటాం, ధర్మంగా నడుచుకుంటాం, సత్యాన్ని పలుకుతాం, అవినీతికి దూరంగా ఉంటాం, అత్యాచారాలకు, హత్యలకు అతీతంగా ఉంటాం, త్యాగానికి సంసిద్ధంగా ఉంటాం అని ఉంటున్నాయా! ప్రజల క్షేమం కొరకు ఆత్మసాక్షిగా, కుటుంబ సభ్యుల పేరుపేరునా, దైవసాక్షిగా దైవసన్నిధిలో దీపం వెలిగించి ఎలక్షన్ ప్రచారాలు ప్రారంభిస్తాం, చేయలేని పనులను చేస్తామని అబద్ధాలు చెప్పం అని చెప్పబడు తున్నాయా?**

రాజకీయ నాయకులు, బ్యూరోక్యార్ట్స్, వ్యాపారవేత్తలు ఒకరితో ఒకరు విభేదించితే ప్రజలు దారుణంగా నష్టపోతారు. లేదు ఒకరితో ఒకరు చేతులు కలిపితే కూడా ప్రజలు భయంకరంగా నష్టపోతారు. అన్యాయానికి, ఇదే 'ఆది' 'అంతము' అవుతుంది. కేవలం 25-30 శాతం ఓట్లతో, సీట్లతో, ప్రభుత్వాధి కారాన్ని చేజిక్కించుకున్న అధికార పార్టీని 70 శాతం మంది తిరస్కరిస్తున్న అన్యాయానికి రాజ్యాంగం, రాజకీయ పార్టీలు, మ్యానిఫెస్టోలు ఏం జవాబు చెబుతాయి.

## ముగింపు

రాజ్యాంగం సూర్యునిలా, చంద్రునిలా అందరికీ సమానంగా వెలుగును చల్లదనాన్ని అందించాలి. అలాకాక, అది కొంతమందికి మాత్రమే పరిమితమైతే దోపిడి వ్యవస్థ అవుతుంది. అలాంటి రాజ్యాంగం వలన జీవితాలు, అసమర్థుల జీవితయాత్రలలా తయారవుతాయి. నేడు రాజ్యాంగానికి ప్రజాస్వామ్యానికి సూర్యగ్రహణం చంద్రగ్రహణం, ఒకేసారి పట్టి ఉన్నాయి.

స్వాతంత్ర్యానికి ముందు ఈ సమాజంలో పండితులనుండి, పామరుల వరకు కూడా, హరికథలు నాటకాలు బుర్రకథలు పురాణ ప్రవచనాలు, జముకుల కథలు, యక్షగానాలు, తోలుబమ్మలాటల ద్వారా ఈ దేశంలోనిపౌరులకు, హిందూమతం లోని మూలాలు తెలుసు. నేడు రాముడు, కృష్ణుడి పేర్లుతప్ప మిగతా అవతారాల వివరాలు తెలియవని చెప్పడానికి సందేహించనవసరం

లేదు. ఈనాటి యువతకు, సత్యహరిశ్చంద్రుడు నలచక్రవర్తి బలిచక్రవర్తి వివరాలు ఎంత మందికి తెలుసు.

శ్రద్ధతో పనిచేయని వ్యక్తులు కుటుంబాలు వ్యవస్థలు, సమాజాలు, దేశాలు, అభివృద్ధిలోకి వచ్చిన దాఖలాలులేవు. అది మౌర్యచంద్రగుప్తుని సామ్రాజ్యమైనా, మొగలాయి సామ్రాజ్యం అయినా, రోమన్ సామ్రాజ్యమైనా, అభివృద్ధిని సాధించకపోవడమేకాక, సోమరిపోతులై సాధించిన అభివృద్ధిని, నైపుణ్యాన్ని పోగొట్టుకుని శ్రమచేయకుండా ఆనందాల్లో మునిగి తేలుతూ, కష్టపడకుండా సంపాదించాలన్న ఆలోచనను, సంస్కృతిని పెంచి పోషించిన కారణంగా ఆకాశమంత ఎత్తుకు ఎదిగి కుప్పకూలిన వైనం చరిత్రను తిరగేస్తే తెలుస్తుంది.

ప్రభుత్వ ఆధీనంలో ప్రతి వస్తువు సేవా గుణగణాలను ధర వ్యత్యాసాలను తూకంలోని తేడాలను, సమయా సందర్భాలను పర్యవేక్షించేందుకు మున్సిపాలిటీ దగ్గర నుండీ సెంట్రల్ విజిలెన్స్ వరకూ, సేల్స్ టాక్స్ నుండీ ఇన్‌కం టాక్స్ వరకూ అనేక డిపార్టుమెంట్లు, టీ బంకు నుండి పెద్ద కంపెనీల కార్యక్రమాల వరకూ పర్యవేక్షణ జరుపుతాయి. కాని ఆశ్రమాలలో రాజకీయ అడ్డాలలో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై పర్యవేక్షణ వుండదు. అక్కడ అన్నీ మినహాయింపులే.

ప్రజాస్వామ్యంలో దారుణమైన అస్వతంత్ర పరిస్థితి పోలీసు శాఖది. పోలీసు తమదైన శైలిలో నేరాన్ని బయట పెట్టించేందుకు వీలులేక ప్రజలకు న్యాయం చేయడానికి వీలు కావడంలేదు. కారణం తప్పుచేసిన వాడిని కొమ్ముకాచేందుకు, రౌడీలు గూండాలు రాజకీయ నాయకులు తయారుగా ఉంటారు. కర్తవ్య నిర్వహణ చేయలేక పోలీసువాళ్ళు కూడ రాజకీయ నాయకులతో పాలు నీళ్ళలా కలిసి పోవడం సహజమైపోయింది. నేరస్థుల విషయంలో రాజకీయనాయకుల ఒత్తిడి లేకుండా వాళ్ళను స్వతంత్రంగా కర్తవ్య నిర్వహణకు అవకాశాన్ని కల్పిస్తే ప్రస్తుతమున్న పోలీసు ఫోర్స్‌లో 50 శాతం మందితో నాలుగు రెట్లు మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.

కానీ రాజకీయ నాయకులు వాళ్ళ మానాన వాళ్ళను బ్రతకనీయరు. ఒకవైపు రాజకీయ నాయకుల ఒత్తిడి, రెండవవైపు పై అధికారుల ఒత్తిడి, మరోవైపు ప్రజలు ఒత్తిడితో నలిగిపోతున్నారు. అసలు నేరస్థునికి పోలీసు అంటే భయం పోయింది. దేశంలో నేరస్థుల సంఖ్య పెరుగుతున్నది. కాబట్టి పోలీసు సంఖ్యను స్టేషన్ల సంఖ్యను పెంచాలనే ప్రయత్నం తప్ప, నేరాలను నేరస్థులను తగ్గించాలనే ఆలోచనలు కాని, ఆచరణలు కాని లేవు. దీంతో సమాజంలో వ్యక్తులకు 'రక్షణ' లేకుండా పోయింది. ప్రస్తుతం పోలీసులు నేరస్థులని చూసి భయపడి వాళ్ళ రక్షణ కొరకు రౌడీలను గుండాలను ఆశ్రయించే పరిస్థితిని చూస్తున్నాము.

అదేమి గ్రహచారమో మానవునిలో నాగరికత పెరిగేకొద్దీ రాజ్యాంగం చట్టాలు తయారు చేసుకొని వాటిని అమలు పరచడంలో అనేక కుయుక్తులు పన్ని ప్రభుత్వ శాఖలను, వ్యవస్థలను తమ స్వార్థానికి ఉపయోగించుకునే మానసిక దౌర్భల్యంతో సంకుచిత స్వభావాన్ని అలవరచుకోవడం ఆనవాయితి అవుతున్నది. కానీ విచిత్రం ఏమిటంటే, ట్రైబల్స్‌లో ఇలాంటి అనాగరికతా చిహ్నాలు లేవు. వాళ్ళలో దాచుకోవడం, అసూయ, దోచుకోవడం, దొంగతనం, అవసరానికి మించి సంపదను కూడబెట్టుకోవడం ఉండవు. అసత్యాలను పలికే తెలివి తేటలు, తెగువ, నిజాలను మసి పూసి మారేడుకాయ చేయగల సామర్థ్యం ఉండదు. అంటే నాగరిక సమాజం కంటే, ట్రైబల్ సమాజాలు చక్కగా వున్నాయి. వాళ్ళందరూ కష్టపడి జీవనం సాగిస్తున్నారు. నాగరిక సమాజాల్లో కష్టపడకుండా సంపాదించాలని, అనుభవించాలనే వైఖరితో బ్రతుకుతున్నారు. ఏ వ్యక్తి అయినా తన పనిలో తనను పండించుకోకపోతే తాను వ్యర్థజీవి అవుతాడు.

భగవంతుని సృష్టిలో మానవుని నిర్మాణక్రమం అతి విచిత్రం. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనస్సు, త్రిగుణాలు, మనోబుద్ధి అహంకారాలు ఉన్నా, జీవునికి ఋషులు, ఆచార్యులు, గురువుల, వేద పురాణ గ్రంథాల ద్వారా మానవుని ప్రవర్తనను, ధర్మాధర్మాలను, మంచి చెడ్డలను గురించి అన్నివయస్సుల వాళ్ళకు నిరంతరం అన్ని సందర్భాల్లో చెప్పవలసిన అవసరం రావడం ఒక పెద్ద ప్యారడాక్స్.

అహం బ్రహ్మాస్మి. ప్రతివాడు సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ. అయినా చెప్పలేనన్ని సమస్యలతో, అంతులేని బాధలతో నలిగిపోతూ ఫ్రస్టేషన్‌తో ఆరాటంతో ఒత్తిడితో చిక్కి శల్యమైపోతున్నాడు. దీనికి కారణం, వేల సంవత్సరాలుగా, "త్యాగబుద్ధితో జీవించు, అనుభవించు" అన్న ఉపనిషత్తుల బోధనల సారాంశం గాలికి వదిలివేయడమే. ముందు తరాలవారు, వేల సంవత్సరాలుగా కోటలు దేవాలయాలు మసీదుల శిల్పకళా సంపద నేటికీ నిలబడ్డానికి కారణం వాళ్ళ శ్రమ, శ్రద్ధ ఓరిమి తపన, కష్టాన్ని ఇష్టంగా చేసుకునే మనస్తత్వం. భౌతిక సంపదతో ఆధ్యాత్మిక సంపదను జోడించి, వేద వేదాంగాలను ఉపనిషత్తులను పురాణాలలాంటి గ్రంథాలతో మానవుని జీవితానికి దశను దిశను చూపించిన గొప్ప సంస్కృతి ఏమైపోయింది?

నేడు రాజ్యాంగంలో శంకరాచార్యులు వచించిన, వేమన తెలియచెప్పిన "మాయ" మాత్రం మిగిలి ఉన్నది. అనగా రాజ్యాంగం అందరికి అంతా ఉంది. కాని ఎవరికీ ఏమీ లేదు. ప్రతివాడు దుఃఖితుడే, ఆరాటంతో అణగారిపోతున్నవాడే. ఏ ప్రభుత్వం అయినా అనేక రకాల రాయితీలు, కన్సెషన్‌లు , సబ్సిడీలు, ఆహారానికీ గుడ్డకు గూడుకు ఆరోగ్యానికి లోటు లేకుండా తమ నైపుణ్యాన్ని, జ్ఞానాన్ని వాడకుండా ప్రతిఫలాన్ని ఆశించి, శ్రమించకుండా అన్నీ ఉచితంగా అందించి వాళ్ళను బిచ్చమెత్తేవాళ్లుగా దాసులుగా బలహీనులుగా చేసి వారిని జీవితాంతం ఇతరుల మీద ఆధారపడేటట్టు చేయడమే. అటువంటివారిని రాజకీయ పార్టీలు, నాయకులు ఒకరి తరువాత మరొకరి చెప్పుచేతల్లో ఉంచుకుంటూ వారి నైపుణ్యాలను తెలివితేటలను వారి నుండి వెడలగొట్టి, వాళ్ళను అసమర్థులుగా నిర్వీర్యులుగా నిర్జీవులుగా తయారు చేయడం, ఆర్థిక రాజకీయ సామాజిక వ్యవస్థలను కూలద్రోయడమే.

నేడు కావాల్సింది శాంతియుతమైన జీవితాన్ని గడపడం. "శతమానంభవతి", "నాదీ స్వతంత్ర్యదేశం, నాదీ స్వతంత్రజాతి" అని ఎలుగెత్తి చాటుతూ జీవితాలను పండించుకోవడం. నేటి సమాజం మొదటి వర్గం దైవం మీద, రెండవ వర్గం ఆచార్యులు, బాబాలు, స్వామీజీలు, మఠాధిపతులు, మాంత్రికులు, తాంత్రికుల

మీద ఆధారపడి, వాళ్ళు దేవుని సంతతి అని నమ్మిన బాధాతత్పరులు తమ వ్యక్తిత్వాన్ని స్వాతంత్ర్యాన్ని వారికి కుదువపెట్టి దాసోహమని ధనాన్ని, మానాన్ని, సిగ్గును, లజ్జను వదిలి వేస్తున్నారు.

## మార్పుకు ఆహ్వానం

పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సిద్ధాంతాల మీద తయారు చేయబడిన నేటి రాజ్యాంగ, రాజకీయం ప్రస్తుత వాతావరణానికి ఆచరణయోగ్యమైనది కాదు. ఈ ఆలోచనలతో కూడిన రాజ్యాంగ మార్పుకు ఏ కొద్దిమంది వ్యక్తులో అంగీకారం తెలుపవచ్చు. కానీ అధికారాన్ని లక్ష్మిని హస్తగతం చేసుకునే, రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తలు, అధికారగణాలు, స్వామీజీలు, వ్యాపార దిగ్గజాలు సుతరాము అంగీకరించరు.

ఎందుచేతనంటే, వాళ్ళకు రాజ్యాంగంలో చట్టాల్లో ఎన్ని లొసుగు లుంటే అంత వసతిని కల్పించుకొని తమ లక్ష్యాలను సాధించు కోవడానికి అవకాశాలు మెండు అవుతాయి. దానితో ప్రస్తుత ప్రజాస్వామ్యం తోకను ఆడించే కుక్కలా కాక, కుక్కను ఆడించే తోకలా తయారవుతున్నది.

సామాన్య ప్రజలు కొందరు అంగీకరించినా జరిగేదేమీ ఉండదు. కాదంటే 'అన్యాయాన్ని, అసమానత్వాన్ని' అంగీకరించిలేని తాపత్రయం తపన ఆవేదన ఆవేశం ఇలాంటి ప్రయత్నానికి ప్రేరేపించి తెరదీస్తుంది. ఇది ఒక కల, భ్రమ, ఆశయం. అంతే! అంతకుమించి మరేమీ లేదు. ఈ ఆలోచనలో పిసరంతైనా ఉపయోగపడే విషయముంటే స్వాగతం పలకండి. లేదనుకుంటే మరచిపోండి.

రచయిత తాను వ్రాసినది పరిపూర్ణంగా అన్నివిధాలా సరైన రాజ్యాంగ విధివిధానమని అనుకోవడం లేదు. ఈ పుస్తకంలోని విషయాలు విద్యావంతులకు లోకజ్ఞానం కలవారందరికీ తెలుసు అన్న విషయం రచయితకు ఎరుకే. అయితే తెలిసి తెలిసి ఈ తప్పులను ప్రజలు చేయడం, వాటిని సమర్ధించి అంగీకరించడం శోచనీయమని దాని పర్యావసానాలకు పరిష్కారాలను మరొకసారి గుర్తుకు తేవాలనే ఆవేశం రూపుదిద్దుకున్నది. అయితే ప్రస్తుత రాజ్యాంగానికి మార్పులు చేయవలసిన

అగత్యం ఎంతైనా ఉందని మాత్రం దృఢంగా నమ్ముతున్నాడు. రచయిత తప్పుగా వ్రాసివుంటే నిందించండి లేదా క్షమించండి.

ప్రజల శ్రేయస్సు కొరకై మంచి రాజ్యాంగం కావాలంటే, నమూనాను తయారు చేయడానికి దేశంలో మేధావులకు కొదువ లేదు. రాజకీయ పార్టీలు 'ఊ' అంటే చాలు క్షణాల్లో న్యాయానికి పెద్దపీట వేయబడిన సరిక్రొత్త రాజ్యాంగం తయారవుతుంది.

రచయిత ఇక్కడ ప్రస్తావించినది సముద్రంలో దాగివున్న హిమపర్వత శిఖరం ( టిప్ ఆఫ్ ది ఐస్‌బర్గ్ ) మాత్రమే. అసలు విషయాలు బయటకు రావాలంటే మేధోమథనం జరగాలి. అప్పుడు సమస్యలకు పరిష్కారాలు వెతకడం సులభం అవుతుంది. నిజానికి సమన్యాయం కోసం రాజ్యాంగాన్ని మారిస్తే నష్టమేమిటి? నష్టం జరుగతుందని ఋజువయితే ఎవరికి ఎంత నష్టం!ఎంత లాభం! అన్న విశ్లేషణను చేయకుండా రాజ్యాంగాన్ని మార్చకూడదు అనడం పిడివాదం అవుతుంది.

రచయిత వ్రాసిన తప్పుల నుండి ప్రత్యామ్నాయంగా మంచిని వెలికితీసే ప్రయత్నం చేయండి. ఒప్పులను ఆహ్వానించండి. మార్పుకు మీవంతు కృషి చేయండి.


ప్రస్తుత రాజ్యాంగం, గట్టుకు రంధ్రం బడిన తటాకంలా, రంధ్రంతో కూడిన పడవలా ఉన్నది. నిండా నీరు ఉన్న పెద్ద తటాకం గట్టుకు రంధ్రం ఏర్పడితే మొత్తం నీరు బయటకు వెళ్ళిపోయి తటాకం ఖాళీ అవుతుంది లేదా తటాకం నీటిమీద ఉన్న పెద్ద పడవకు రంధ్రం ఏర్పడితే తటాకంలోని నీరు పడవలోకి చేరి పడవ మునిగిపోతుంది. కాబట్టి రంధ్రం అటు తటాకాన్ని ఖాళీ చేయగలదు, యిటు పడవను ముంచేయగలదు. అందుచేత రంధ్రాలు లేని రాజ్యాంగం కొరకు ప్రయత్నించాలి.

**– రచయిత**

స్వస్తి

*

**మంచి చెడ్డలు యుగయుగాలుగా పకృతిలో ఇమిడి ఉండే నైస్వర్గిక స్వరూపాలు. మానవులు దేవతలుగా రాక్షసులుగా ప్రవర్తిస్తూ, బలవంతుడు చెప్పినది చేసినది ధర్మం అని జరిగిన క్రమంలో, కొంతమంది త్యాగధనులు కొత్త ఆలోచనలను ఆవిష్కరించినందున సామాజిక రాజకీయ వ్యవస్థలలో పెనుమార్పులు చోటుచేసుకోవడం విదితమే. కాని ఒకసారి ధర్మం అధర్మంపై గెలుపు సాధిస్తే, మరొకసారి అధర్మం ధర్మంపై గెలుపు సాధించడం చరిత్రలో అనేక సంఘటనల ద్వారా ఋజువు అవుతున్నదే. ఈ కారణంగా ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలలో ప్రజలు అనేక ఇబ్బందులకు లోనవుతుండడం, కొంతమంది కొంతకాలం సుఖాన్ని అనుభవించడం, మిగతావాళ్ళు దుఃఖానికి లోనుకావడం సహజమైంది. ఈ వ్యవస్థలో మార్పులను చేర్పులను చేకూర్చేందుకు చేసిన ప్రయత్నాల ఫలితమే బానిస వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థకు మానవాళి చేరుకోవడం ఒక పెద్దవిజయం. ఈ సమాజాన్ని అభివృద్ధిపథంలో నడిపించడానికి రాజ్యాంగానికి చట్టాలకు వ్యవస్థలకూ మెరుగులుదిద్ది, వ్యక్తులు ప్రేమను పుణికి పుచ్చుకొని త్యాగాన్ని లక్ష్యంగా మార్చుకోవడానికి అవకాశాన్నీ వాతావరణాన్నీ కల్పించుకో గలిగితే 'సర్వేజనాః సుఖినోభవన్తు', 'సమస్త సన్మంగళానిభవన్తు' అన్న లక్ష్యానికి చేరువ కావచ్చు. ఈ రచనకు పునాది ఈ ఆలోచన.**



Acharya Seshaiah Kandamuru, M.Com., Ph.D. is a retired Professor of Commerce and Management of Sri Venkateswara University, Tirupati. Primarily, he is a teacher at heart apart from being an administrator, researcher, consultant, trainer and a mentor. He was the Founder Secretary of Bharatiya Vidya Bhavan, Tirupati Kendra School and Ex-Honorary Director of Andhra Pradesh Productivity Council, Tirupati.

He has organized thousands of programmes covering Leadership, Motivation, Communication, Organizational Behavior (OB) and Entrepreneurial Development including PMRY and CMEY. His mission is to convert problematic and lethargic children into successful career oriented people. He is a recipient of "*Pratibha Puraskar*", "*Best Citizens of India" "Vijnana Vidvanmani"* and "*Siksha Ratna*". His mission is to solve the real and notional problems of people. He mentors parents, children, men and women of all ages and positions to come out of their utopian thinking that damages their health, wealth and relationships. He authored articles and books on Banking, Commerce, "21 Leadership Lessons" (Co-authored), "Fate & Free-Will: The Philosophy of Fate and the Science of Free Will", "Leadership Proverbs", "Communication Skills", "Personality Development", "Meet the Mentor to Leader", "Sri Sreenivas Charitam" (Telugu Lyrics), "Nitya Jeevitamlo Bhagavad Gita" (Telugu), "Krishna", **"పూర్ణిమ" (నవల), "తరాలు అంతరాలు" (నవల), "జగన్నాటకం" (నవల)** and "Bala Kadha Sudha" (Children Stories - Telugu). "The Work Culture in Bhagavad Gita", "Lokagnanam", "A Story Book for Children" and "The Physics of Philosophy and The Philosophy of Physics" are under print.